నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 26-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:102 పేజీలు:68 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

భూ ఆక్రమణ
యుగాల తరబడి
ఆగని పోరు

ఒకే వంటకం
ఆహానా పెళ్ళివిందు
పొదుపు మంత్రం

క్యూ దెంగా టీక
మార్కెట్టులోన లభ్యం
దెంగింకా డింగు.

ఆంగ్లేయ నీతి
నాలుగు ముక్కలాట
యు.కె. గల్లంతు.

రేపురా మాట
సమస్యలకు బాట
నేతల పాట.

- రేడియమ్

సెల్: 9291527757

శ్రీనిజాలు

ఇది డెమొక్రసీ దేశం
ఉన్నదా ప్రజాస్వామ్యం ?
కేంద్ర ఎన్నికల సంఘం
వ్యవహారం అపసవ్యం !
జనాభాను తగ్గించెను
అవకతవకల ' సర్ ' !
ఓట్లు తొలగించే హక్కు
ఎవడిచ్చాడు సార్ ?

- కందుకూరి శ్రీరాములు

సెల్:9440119245

పౌల్ట్రీ పరిశ్రమకు ప్రాధాన్యత రంగం హోదా.. కొత్త పాలసీలు తెస్తాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబరు 25: నగరంలోని హెచ్ఐసీసీలో నిర్వహించిన పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఈశ్వర్ కుమార్, రాజ్ కుమార్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మాల్ రెడ్డి రాంరెడ్డి, శివసేనారెడ్డి, పౌల్ట్రీ ఇండియా ప్రెసిడెంట్ ఉదయ్ సింగ్ బయాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ 5 కోట్ల 30 లక్షల గుడ్లను ఉత్పత్తి చేస్తూ విద్యార్థులు, యువతకు పౌష్టికాహారం అందించడంలో పౌల్ట్రీ వ్యాపారులు కీలక భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ స్థాపనకు ఎదురవుతున్న సమస్యలను పరిశ్రమ ప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని, సంక్షోభ సమయాల్లో ప్రభుత్వం అండగా ఉండాలని కోరుతూ పలు ప్రతిపాదనలు అందించారని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో పౌల్ట్రీ యూనిట్ల నిర్మాణానికి సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసేలా అవసరమైన మార్పులు తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

పౌల్ట్రీ పరిశ్రమ కేవలం కోళ్లు, గుడ్ల ఉత్పత్తికే పరిమితం కాదని, రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రెండేళ్లకు సరిపడా సన్నబియ్యం నిల్వలు ప్రభుత్వం వద్ద ఉన్నాయన్నారు. అయితే.. పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన మొక్కజొన్న కొరత అంశం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రులను ఆదేశించారు. పౌల్ట్రీ రంగాన్ని కూడా ప్రాధాన్యత రంగంగా గుర్తించి, పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రత్యేక విధానాలు రూపొందిస్తామని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పెట్టుబడుల ఆహ్వానం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబరు 25: తెలంగాణలో వ్యవసాయ.. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

ఈ నేపథ్యంలో గ్లోబల్ సమ్మిట్‌లో వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించిన పెట్టుబడుల ఆకర్షణపై సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ కంపెనీల ప్రతినిధులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణలో వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల పరిస్థితులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ఉన్న అవకాశాలను మంత్రి వివరించారు. రాష్ట్రంలో విస్తారమైన వ్యవసాయ ఉత్పత్తులు, నాణ్యమైన ముడిసరుకు లభ్యత, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత ఆధునికీకరించడంతో పాటు పెట్టుబడుల ద్వారా కొత్త పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కంపెనీల ప్రతినిధులకు వివరించారు.

వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపునకు ప్రాధాన్యత..

రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువను కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, నిల్వ, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల రైతులకు మెరుగైన ధరలు, స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. ముఖ్యంగా యువతకు నైపుణ్య ఆధారిత ఉద్యోగాలు కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు దోహదపడతాయని పేర్కొన్నారు.

ఖేలో ఇండియా గేమ్స్.. క్వాలిటీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 25: ఖేలో ఇండియా క్రీడా పోటీలకు వచ్చే ఆహ్వానితులు, క్రీడాకారులకు అందించే ఆహారం, అకామిడేషన్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్టేడియంల పునరుద్ధరణతో పాటు ఏర్పాట్లలో నాణ్యత విషయంలో రాజీపడొద్దని స్పష్టం చేశారు. క్వాలిటీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. తెలంగాణలో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి మెరుగైన శిక్షణ అందించేందుకు దేశంలో బెస్ట్ కోచ్‌లను నియమించాలని సూచించారు.

ఈరోజు (బుధవారం) ఎంసీహెచ్‌ఆర్డీలో ఖేలో ఇండియా పోటీల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, క్రీడా వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, సీఎం సలహాదారు కే. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్, మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాల దేవి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో కీలక అంశాలపై చర్చించారు. ఖేలో ఇండియా పోటీల ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు కీలక సూచనలు చేశారు.

క్రీడా స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలి..

డిసెంబరు 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఖేలో ఇండియా పోటీలను నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబరు 11వ తేదీన అట్టహాసంగా ఖేలో ఇండియా పోటీలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు, గచ్చిబౌలిలో ముగింపు వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భాగ్యనగరమంతా క్రీడా స్ఫూర్తి ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. పోలీస్, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పనిచేయాలని ఆజ్ఞాపించారు. ఈ గేమ్స్ ఏర్పాట్లకు సంబంధించి ఒక్కో విభాగానికి ఒక్కొక్కరిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి బాధ్యులను చేయాలని సూచించారు.

ఈ పోటీల ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లాలవారీగా మంత్రులను ఇన్‌చార్జ్‌లుగా నియమించాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో ఇన్‌చార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించాలని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి సూచించారు. మహబూబ్‌నగర్ పరిధిలో జూపల్లి కృష్ణారావు, వరంగల్ పరిధిలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ పరిధిలో అడ్లూరి లక్ష్మణ్‌కు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. ఖమ్మం పరిధిలో తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్ పరిధిలో సుదర్శన్ రెడ్డిని ఈ పోటీల ఏర్పాట్ల పర్యవేక్షణకు బాధ్యతలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

టెక్నాలజీతో పోలీస్ సేవలు మరింత వేగవంతం: డీజీపీ



హైదరాబాద్, నవంబర్ 25: టెక్నాలజీతో పోలీస్ సేవలను మరింత వేగవంతం చేస్తున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఏఐతో పోలీస్ సేవల్లో కొత్త మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మోడల్ ఏఐ పోలీస్ స్టేషన్‌గా పంజాగుట్టను ఎంపిక చేశామని తెలిపారు. ఈరోజు (బుధవారం) పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను డీజీపీ సందర్శించారు. ఏఐ పోలీస్ స్టేషన్ పనితీరును పరిశీలించారు. అడిషనల్ డీజీపీ

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టుగా తొలిసారిగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఐ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలీస్ అధికారుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఆయా ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ యంత్రం ముందు బాధితులు తమ సమస్యను వివరిస్తే చాలని తెలిపారు. బాధితులు చెప్పిన వివరాలతో ఫిర్యాదు కాపీ సిద్ధం అవుతుందని అన్నారు. ఆటోమేటిక్‌గా సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేరుతాయని వివరించారు. టెక్నాలజీతో పోలీస్ సేవలను మరింత వేగవంతం చేసే దిశగా చర్యలు చేపట్టామని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

తప్పు చేస్తే సొంత అధికారిపైనా చర్యలు తీసుకుంటాం: తెలంగాణ ఏసీబీ

హైదరాబాద్, నవంబర్ 25: తెలంగాణ ఏసీబీ అధికారిపై మాజీ విద్యుత్ ఏడీఈ అంబేద్కర్ చేసిన ఆరోపణలపై ఏసీబీ ఉన్నతాధికారులు స్పందించారు. ఏసీబీలో అవినీతికి జీరో టాలరెన్స్ అని స్పష్టం చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, సొంత శాఖ అధికారులైనా తప్పు చేసినట్లు నిరూపితమైతే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు అధికారిపై మాజీ ఏడీఈ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి శాఖాపరమైన విచారణ జరుపుతామని ఏసీబీ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఈ ఫిర్యాదుకు సంబంధించి వివరణ ఇచ్చేందుకు ఫిర్యాదుదారుడికి ఇప్పటికే మూడుసార్లు విచారణకు హాజరుకావాలని అధికారులు పిలిచినట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. అయితే ఆయన ఒక్కసారి కూడా విచారణకు హాజరుకాలేదని పేర్కొన్నాయి.

గూగులమ్మ జాబిలమ్మలా వెన్నెలనే ఇవ్వదు!



గో..గో.. గూగుల్ మీద భలే రెస్పాన్స్ వచ్చింది. అంటే అంతా మంచిగా అనుకోవద్దు. మమ్మల్ని వాయించిన వారున్నారు. కొంతమంది మాలాంటి వారి కడుపులు కొడుతున్నారు. అసలే పత్రికలు లేవు. ఒకటో అరో ఉన్నా అందులో పారితోషికం ఇచ్చేవారు లేరు. చాయ్ పానీ ఖర్చులకు వస్తున్నాయి కదా అనుకుంటే, మీరు ఇలా చేయటం బాగుందా అని. ఇప్పుడు అసలు సమస్య వచ్చింది. ఇదంతా మన ప్రతిభ కాదని లోకం గుర్తిస్తుందని బోల్డంత దిగులు కూడా దీని వెనకాల ఉంది. అందుకని మా బృందం సమావేశం అయ్యాం - విత్ అవర్ మెంటార్.

ఇప్పుడు మీకు అర్థమై ఉంటుంది. మేం మిస్టర్ క్లీన్ అనటం లేదు. అందుకు కారణం ఆ బిరుదు మీద లేదా మా కాయినింగ్ మీద వచ్చిన విమర్శ లాంటి దాడి మీద కాదు. అలాంటి ప్రభావం లేదా అంటే ఉంటుంది. ఇది శాశ్వతం అనుకోవద్దు. ఎవరికయినా అత్యంత సమ్మగా ఉండేది ఇలాంటి బిరుదులే. తమ పేరుకు ముందు అలాంటివి ఉండాలి. అది మనకు ఎవరు ఇచ్చారనేది కాదు.. ఎవరికి వారు సొంత బిరుదులు తగిలించుకున్న సంఘటనలుతెలుగు నుండి అన్ని రకాల, అన్ని భాషల సాహిత్యాల్లోనూ ఉన్నాయి. ఇలాంటి విమర్శలు వచ్చినప్పుడు నాలుగు రోజులు అవి తీసి పక్కన పెడతారు.

అప్పుడు అభిమానులు అంటారు - ఎవరో ఏదో అన్నారని బిరుదులు పక్కన పెడతారా. అంటే వారి విమర్శలు మనం ఒప్పుకున్నట్లే. అందుకని ఎవరు ఏమన్నా మనం పట్టించుకోనవసరం లేదు. ప్రస్తుతం 750 కోట్ల జనాభా ఉన్నారు. అన్ని బిరుదులు, విశేషణాలు సృష్టించటం కష్టం - గూగుల్ కయినా. అసలు మనుషుల వేలి ముద్రలు, కనుపాపలు ఒకటి కాకపోవచ్చు గాని, పేర్లు మాత్రం చాలా మందికి కలుస్తాయి. సింపుల్ గా చెప్పాలంటే 'అప్పారావు'లు, 'సుబ్బారావు'లు వేలల్లో ఉంటారు. ఇక్కడ ఐడెంటిటీ ముఖ్యం. కేవలం మన పేరు మాత్రమే లేదా బిరుదు మాత్రమే ప్రపంచంలో ఉండటం కుదరదు. అలాంటివాటిల్లో 'మహా' ఒకటి. ఇప్పుడు ఎంతమంది 'మహా' మహాలో! ఇప్పుడు మా మెంటార్ గారు మాట్లాడే ముందు మా దృష్టికి వచ్చిన ఓ విషయం చెప్పాలి.

"ఎవరికీ సాహసం లేనప్పుడు, రాజకీయ రంగంలో లాగే, సాహిత్య రంగంలో కూడా నోరున్నవారిదే రాజ్యం.పదిమంది అభిమానులు కలిసి ఎంత చిన్న రచయిత కయినా ఒక పెద్ద సన్మానం చేసి, తమ పలుకుబడితో పత్రికల్లో పది ప్రశంసా వ్యాసాలు రాయిస్తే, మరునాటికే పెద్ద రచయిత అయిపోతాడు. ఆ పదిమంది సాహిత్య అకాడమిలో సభ్యులో, సభ్యుల ఆప్తులో అయితే ఆ రచయిత కీర్తి పగటి దీపాలే పట్టించుకుంటుంది. ఆ పగటి దీపాలను ప్రజలు ఒక వేడుకగా చూ స్తారు. ఎవరికీ అపకారం తలపెట్టని పెండ్లి ఊరేగింపుని చూసినట్లు. అపకారం ఎక్కడుందంటే, ఉత్తమ సాహిత్యానికి ప్రేరణ ఇవ్వగల విచక్షణాయుత ప్రజాభిప్రాయాన్ని హతమా ర్చడంలో ఉంది. వదిమంది భజనవరుల సాయంతో కీర్తికాంతను చెరపట్టి తెచ్చుకోగల సాహిత్య రాజ్యంలో ఉత్తమ సాహిత్య, సాహిత్య సృష్టికి తగిన ప్రేరణా, ప్రోత్సాహమూ, ప్రతిఫలమూ లభించవు."

ఇది రా.రా. అనే రాచమల్లు రామచంద్రారెడ్డి గారు కొన్ని దశాబ్దాల క్రితం రాసింది. అప్పట్లో 'రచయిత' అనేవారు.

అనగా రచనలు చేసేవారు అని. పుస్తకాల మీద కూడా అది పురుషులు రాసినా, స్త్రీలు రాసినా వారు పేరు మాత్రం ఉండేది. అది చూడగానే ఎవరు రాసారో తెలుస్తుంది. తర్వాతి కాలంలో రకరకాల మార్పులు వచ్చాయి. ప్రతి పదంలోనూ ఈ జెండర్ ఈక్వాలిటీ పాటించటం కష్టం అవుతుందని కొందరు ముందే విన్నవించుకుంటారు. రచయిత అంటే నా ఉద్దేశం స్త్రీ - పురుషులు కూడా అని. అప్పుడూ బాంబులు పేల్చేవారుంటారు. 'రచయిత్రి' అంటే మీ సొమ్మేం పోయింది. రచయిత్రి అంటే రచయిత అనవచ్చు కదా - ఇదే పురుషాహంకారం అంటే అని. అలా ఉంచుదాం.

మనందరి కన్నా వ్యాపారస్తులు, కేపిటలిస్టులు, తెలివిగలవారు. అందులో మహిళల దినోత్సవాలతో పాటు పురుషుల దినోత్సవాలకు ఓ డేట్ ఫిక్స్ చేశారు.

అసలు విషయం ఏమిటంటే రా.రా.గారు కొన్ని దశాబ్దాల క్రితం రాసిన విషయాలు ఇప్పుడు విశ్వరూపం చూపించటం. ఇందులో పురుషులు మాత్రమే కాదు మహిళలు ఏమాత్రం తక్కువ తినలేదు. సేల్స్ కోసం రకరకాల స్కీం లు ప్రవేశపెడుతుంటారు. అది వస్తువులకు మాత్రమే కాదు. సాహిత్య సరుకులకు కూడా. కాగా ఇది సముద్రమంత సబ్జెక్ట్. కాబట్టి తీరిగ్గా చర్చించుకుందాం. ఒక విషయంతో ఈ అంశానికి ముగింపు పలుకుదాం. ఒకప్పుడు ఇలాంటివి గమనించినప్పుడు రా.రా. లాంటి క్రూర విమర్శకులు తప్ప పెద్దగా స్పందించేవారు కాదు.

ఇలాంటి బాపతులను చూసి నవ్వుకునేవారు. జాలి పడేవారు. మౌనంగా ఉండేవారు. సమాజం ఇలాంటి వికృత పోకడలకు లోనైనప్పుడు ఇంకా మౌనం అర్థాంగీకారం అనుకుంటారని బయటకు రావడం మొదలుపెడతారు.

కాగా ఇప్పుడు భజనలు చేసేవారు సైతం (భజనలన్నీ భక్తితో చేయరు. ప్రతి భజన వెనుక ప్రయోజనాలు ఉంటాయి) ఇప్పుడు మాట్లాడుతున్నారు. అలాంటి సందర్భం వచ్చేసింది. ఇవన్నీ మా మెంటార్ గారి విశ్లేషణలే.

మేం అలాంటి వారి నుండి నేర్చుకోవాలి కదా!

మళ్లీ గూగుల్, ఏ.ఐ, చాట్ జి.పి.టి లాంటి వాటి దగ్గరకు వద్దాం. ఇప్పుడు కథలు, కవిత్వం, నవలలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, అనువాదాలు ఒకటేంటి ఏ రంగం చూసినా అవన్నీ కృత్రిమ మేధ చేస్తున్న పనులే. మనం మనకు తెలియని ప్రాంతాల గురించి, వ్యక్తుల గురించి, వ్యవస్థల గురించి ఇంకా సవాలక్ష రాయాలనుకున్నప్పుడు పుస్తకాల మీద ఆధారపడేవాళ్ళం. అలాగే రకరకాల మార్గాలు ఉన్నాయి. మనుషులు అన్ని ప్రాంతాలకు వెళ్ళలేరు. అన్ని విషయాలను దగ్గరుండి పరిశీలించలేరు. ఇప్పుడు ఆ స్థానంలోకి గూగుల్ వచ్చింది. అది అన్ని రకాల సమాచారాన్ని మనకు ఇస్తుంది. దాంతో పాటు మనం సబ్జెక్టును ఫీడ్ చేస్తే ఏ ప్రక్రియలో అయినా రచన చేస్తుంది.

దీనిని ఎంతవరకు వాడుకోవాలో అంతే వాడుకోవాలి. అంతే తప్ప నిన్ను నీవు, నువ్వు ఇతరుల్ని మోసం చేయకూడదు. మా మెంటార్ గారి మాటల్లో?

"నీ కడుపులో, మెదడులో పుట్టిన, పుట్టాల్సిన వాటిని కృత్రిమంగా ఎలా తయారు చేస్తావు. నీది కానిదాన్ని నీదని ఎలా చెప్పగలవు. అంత ఓపిక లేని వారికి ప్రశంసలెందుకు. అవి కూడా ఏ.ఐ.కి అంకితం చేయండి."

"మరి ఇన్ని విషయాలు తెలిసి కూడా ఫేస్ బుక్కుల్లో ఎందుకు రెచ్చిపోతున్నారు" అంది అన్య.

"తుత్తి" అని "ఇది కృత్రిమ ప్రపంచం. పోయేటప్పు డు మనతో ఏదీ రాదు అని తెలిసినా మనుషుల తాపత్రయం ఆగదు" అన్నారు.



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575



చురక

అవినీతిని నిరోధించే
అధికారులే అవినీతి
చీకటి తెర వెనుక దందా
చెలాయించే భ్రష్ట నీతి.
కంచే చేను మేసినంక
కావలింకా మరి ఎవరు
ప్రభుత్వం నిఘా లేక
ప్రక్కకెళ్లే వారి పవరు.

-వేల్పుల నారాయణ
9440433475

రాధశ్రీ రాగాలు

అతడు చెప్పెడి ఇజము
ఇతడు నమ్మని నిజము
కాదు జగతికి హాజము
అనును రాధశ్రీ !!
అతడు పుట్టిన వేళ
అతడు నడిచిన నేల
చేయ వలయును హేల
అనును రాధశ్రీ !!

-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 26-11-2026

ఆధునిక మహిళ ఆమె ఆగదు... అణగదు...అలిసిపోదు

అవకాశాల ఆకాశంలో రెక్కలు విప్పుకుని ఎగరాలని ఆశ
సంఘర్షణల సంద్రాన్ని ఈదుతూ
విజయశిఖరాలను అధిరోహించాలనే సంకల్పం.
సమస్యల సంగ్రామాలను
విజయాలతో ముగించాలనే తపన.
తన గమనం ముళ్ళబాటలో అయినా
చరిత్ర సృష్టించేలా సాగాలనే పట్టుదల!.
ఒకనాడు గోడల మధ్యే ఆమె ప్రపంచం,
కుటుంబమే ఆమె బాధ్యత,
త్యాగమే ఆమె ధర్మం.
ఆమె కలలకు కంచెలు, ఆశలకు ఆంక్షలు,
ఆమె ఆలోచనలకు నిషేధాలు
అభిప్రాయాలకు సంకెళ్లు!
కాలంమారింది?.
కదనరంగం మారింది,
ఆలోచన మారింది?. ఆచరణ మారింది,
అక్షరాల వెలుగులో ఆశలు చిగురించాయి,
ఆత్మవిశ్వాసం ప్రజ్వలించింది!
వంటింటి గడప దాటి విప్పారిన కళ్ళతో
ప్రపంచాన్ని పరికిస్తూంది
విద్యాదీప్తితో విజ్ఞాన విజయాలకు దీపశిఖ అవుతూంది.
వైద్యురాలిగా ప్రాణాలకు వెలుగునిస్తూంది,
శాస్త్రవేత్తగా నూతన ఆవిష్కరణలకు ఊపిరి పోస్తూంది,
అంతరిక్షంలోకి దూసుకెళ్తోంది,
క్రీడా రంగంలో సత్తా చాటుతోంది ,
కళా రంగాన్ని శోభస్కరం చేస్తూంది.
పారిశ్రామిక వేత్తగా వేలమందికి ఉపాధి కల్పిస్తోంది.
పాలకురాలిగా దేశానికి దిశానిర్దేశం చేస్తూంది
అవకాశాల ఆకాశం విస్తరించింది, ఆశయాల పతాకం
ఎగిరింది?.
ఐనా?.ఆమె పోరాటం ముగియ లేదు
సమానత్వపు స్వప్నం ఇంకాసాకారం కాలేదు.
ఒకే పని చేసినా వేతనంలో వ్యత్యాసం,
ఒకే ప్రతిభ ఉన్నా పదవుల్లో వివక్ష!
కార్యాలయంలో పోటీ..ఇంటిలో బాధ్యతలు
కుటుంబంలో ఆశలు..సమాజంలో ఆంక్షలు!
ఉద్యోగం లో ఉన్నత స్థాయిని సాధించాలి,
ఇంటిలో ఆదర్శ గృహిణి గా నిలవాలి.
పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలి,
పెద్దల అవసరాలను తీర్చాలి.
తన ఆరోగ్యాన్ని పక్కన పెట్టి
అందరి గురించి ఆలోచించాలి ,
తన అలసటను దాచిపెట్టి చిరునవ్వులు చిందించాలి.
పురుషుడు ఉద్యోగం చేస్తే ,
"ఉద్యోగం పురుష లక్షణం ",
లోతుగా పాతుకు పోయిన పితృస్వామ్య సమాజం
ఇంటి పని ని పంచుకునే బాధ్యతను ఇప్పటికీ
పురుషుడి భుజాల మీద మోపలేదు
రెండు ప్రపంచాల మధ్య నలిగే ఉద్యోగిని జీవితం,
ఎవరికీ కనిపించని ఆమె అంతరంగ సంఘర్షణ!
గృహిణి గా ఉంటే గుర్తింపు కరువవుతుంది,
ఉద్యోగినిగా ఉంటే సమతుల్యత భారమవుతుంది
పెళ్లి తరువాత చదువుకు స్వస్తి చెప్పే యువతులు,
మాతృత్వం తరువాత ఉద్యోగాలకు దూరమయే మహిళలు,
ప్రతిభ ఉన్నా అవకాశాల కోసం ఎదురు చూసేవారు,
ఆశయాలున్నా కుటుంబం కోసంఆగిపోయేవారు!
ఇదేనా ఆధునిక నాగరికత?
ఇదేనా సమానత్వం?
ఇంకా ఎన్ని తరాలు భరించాలి ఈ వ్యత్యాసం!
గృహహింస గాయాలు?.వరకట్న వేధింపులు,
లైంగిక దాడులు?..కార్యాలయ అవమానాలు,
సైబర్ ప్రపంచంలో కొత్తరకం బెదిరింపులు,
స్వేచ్ఛగా బ్రతకాలనే ఇచ్ఛకు అడుగడుగునా ఉరితాళ్ళు?.
తన అభిప్రాయం చెప్తే అహంకారమంటారు,
తన హక్కుల కోసం నిలబడితే బరితెగింపు అంటారు.
ఈ దుర్మార్గపు ప్రేలాపనల మధ్య
సమాజం గుండె మీద సృష్టంగా లిఖించవలసింది?.
"మహిళకు కావలసింది జాలికాదు, న్యాయం,
దయతో ఇచ్చే అవకాశాలు కాదు, హక్కుగా పొందే
గౌరవం, సరిహద్దులు లేని స్వేచ్ఛ"
దేశపు నుదుటి మీద బలంగా ముద్రించ వలసింది?..
"మహిళ ఎదుగుదలే సమాజపు అభ్యుదయం,
ఆమె సాధికారతే దేశ ప్రగతికి సోపానం"
ఈ ఎరిక లేని నేటి సమాజంలో
వివక్షలు, ఆంక్షలు ఆమె శ్వాసనుదిగ్బంధిస్తున్నాయి ఐనా?..
ఆమె ఆగదు?.. అలిసిపోయి?.
అవమానాలకు తలవంచి వెనుతిరగదు!
ప్రతి వైఫల్యాన్ని విజయానికి మెట్టుగా మార్చుకుంటుంది.
ప్రతి కన్నీటి చుక్కను "ధైర్యం"గా మలచుకుంటుంది.
పడిన ప్రతి సారీ మరింత బలంగా లేస్తుంది.
పరాజయాల బూడిదలోంచి
విజయాగ్నిలా వెలుగుతుంది!
ఆధునిక మహిళ
చరిత్రను పునర్లిఖిస్తుంది.



-డా॥ఆలూరి విజయలక్ష్మి
+91 98490 22441

సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
సుధామ
సెల్:9849297958

అచ్చట ముచ్చట
మనసుని చెడుకి మళ్ళించకుండా వుంచు ఇచ్చట .
-మా.శ్రీ.రాజు
కేబీకే పాల్వంచ

రక్షణం తక్షణం
బాధలు కలిగితే కుంగిపోవటం మానవుని లక్షణం
-పుష్ప వేజ్కుట శర్మా.
భువనేశ్వరము.ఒడిశా.

తిరస్కరణ బహిష్కరణ
ఆత్మ పరిశీలన ద్వారా వచ్చేది సంస్కరణ
-కె. వి. వి. సత్య ప్రసాద్
మారేడుబాక (మండపేట)

అండము పిండము
నలువ సృష్టించిన ప్రపంచమే అద్భుతమైన బ్రహ్మాండము.
-కాకర్ల చెంచలరావు
ఒంగోలు.

రాస్తూ! చూస్తూ!!
బాధితులకు అండగా నిలబడు ధైర్యాన్ని అందిస్తూ!!!
-మన్నవ సుధాకర్
విజయవాడ

ఉద్యోగము ఉద్వేగము
నేటికీ తాతల అప్పులపై చేస్తున్న ఊడిగము
-బి వనజాక్షి
హైదరాబాద్

బిడులు గుడులు
ప్రశాంతంగా ఉండు వెళ్ళేచోట - చేయకు అలజడులు..
-ఋష్యశ్రీ
సారవకోట

వీడు వాడు
బంధాలు కలుపుకుంటే అవుతాడు ప్రతివాడూ మనవాడు.
-పడిగెల దేవిదాస్
నిర్మల్

మనువు చనువు
మాయమాటలు నమ్మి కానిదే అర్పించద్దు తనువు
-హైమ. కందుకూరి
లండన్

ఓర్పు నేర్పు
పదుగురు మెచ్చాలంటే కావాలి చక్కని కూర్పు
-వి. సుబ్బారావు
విశాఖపట్టణం.

సమాజ హితం కోసమే ఈ కథలు

పుస్తక సమీక్ష



ప్రతులకు: జస్టిస్ బి. చంద్రకుమార్
8-7-55/బి/2
రోడ్ నెం.3. శిరిడీసాయి కాలనీ,
సాగర్ రోడ్, హస్తినాపురం సెంట్రల్
హైదరాబాద్-500 079.

జస్టిన్ బి. చంద్రకుమార్ ప్రతిభా, ప్రాచుర్యము కల బోసుకున్న అభ్యుదయ భావానుపర్తి, నిత్యానుశీలి, నత్యమార్గాన్వేషి. ప్రవంచపు పోకడలను ఒక కంట గమని స్తూనే తన జీవితానుభవాన్ని కాచి వడబోసు కుంటూనే, లోలోపల అంతర్మధనం, చెందు తూ, అనుభవాల పాఠాంశాన్ని, లోకం తీరునూ అక్షరబద్ధం చేయడం ఒక గొప్ప సంస్కారంగా భావించాలి. కవిత రాయడం, కధ, కథానిక రాయడం ఒక మహాయజ్ఞం లాంటిది. అది చేపట్టిన వారికే అనుభవ పూర్వకంగా అవగతమవుతుంది. జస్టిన్ బి. చంద్రకుమార్ గారు జంట నగరాల సాహితీ ప్రియులకు వక్తగా బాగా పరిచయస్తులు. వీరు గతంలో వ్యాసాలు, కధలు, కవితలు, నవలలు, నవలిక, హిందీ, ఇంగ్లీషు రచనలూ మొత్తంగా కలిపి ఓ 26 వరకూ రచనా వ్యాసంగం సాగించారు. న్యాయ వాదుల విజయానికి మార్గ దర్శకాలు కూడా రచించారు. అవన్నీ ఒక ఎత్తు అయితే ఈ పుస్తకం మరొక ఎత్తు. ఎందుకంటారా ఇది హాస్యానికి సంబంధించినది కావడమే. జస్టిస్ గారేమిటీ హాస్య కథలు, అందునా అదీ ఇవీ అంటూ రాయడం మనకూ గమ్మత్తుగానే అనిపిస్తుంది కదా! మొదటి కథలో మనల్ని అరుణాచలం తీసుకువెళ్ళారు. ఎవ్వరైనా ఎందుకు వెళ్తారు అరుణాచలానికి? రమణ మహర్షిని దర్శించుకోడానికి కదా మరి. మనలాగానే ఓ మంత్రి గారూ వచ్చారు. అయితే మరి మంత్రిగారంటే హడావుడి కదా! పోలీసు వారు ఏమన్నారంటే చూడండి సాధువులు, సన్యాసులు, మీరు ఎవ్వరూ ఆశ్రమం ఆవరణంలో ఉండకూడదు అన్నారట. సరే మంత్రిగారొచ్చారు. లోపలికి వెళ్ళి చూస్తే స్వామి వారు లేరు. అంతా వెతికారు. కనప డందే, మంత్రిగారు పాపం వెయిట్ చేసి, ఎంచగ్గా జారుకున్నారు. ఆ తర్వాత సాధు వులు, సన్యాసులు రావచ్చు అన్నారు. అలాగే వారు అందరూ వచ్చారు. వారి వెనుకే రమణ మహర్షి కూడా వచ్చాడు. సరే మన వాళ్ళంతా స్వామీ స్వామీ అంటూ చెప్పుకొచ్చారు. అప్పుడూ మన రమణ మహర్షి సార్ ఏమన్నారంటే ఆశ్రమంలో సాధువులు సన్యా సులు ఎవ్వరూ ఉండకూడదు అన్నారుగా. నేనూ ఒక సాధువునే కదా! అన్నారట. అదీ సంగతి. ఈ విషయాన్ని మన రచయిత ఒక హాస్యం కథగా మొదటి కథగా ఈ పుస్తకంలో చేర్చారు. తర్వాత శ్యామాకు గుణపాఠం, సాయిబాబా చెప్పిన కథను రాశారు. ఇక సమాధి కథలో గురువు గారు గాడిదను బహూకరించడం, ఆపైన ఆ గాడిద చనిపోవడం, దాన్ని పాతిపెట్టి ఒక జెండా పెట్టం, జనాలు ఇదేదో సాదు మహాత్ముని సమాధి అనుకుని దక్షిణలు పెట్టి వెళ్ళడం జరిగిపోయింది. ఆనోటా ఈ నోటా అంతటా ప్రాకింది. గురువుగారికి కూడా ఆసక్తి పెరిగి వచ్చి శిష్యుని కలిసి అడిగితే చెవిలో చెప్పిన వాస్తవం తెల్సుకున్నారు. ఈ కథ చదవడానికి సరదాగా వున్నా కొంత మేనేజ్ వుంది. లోకంలో ప్రజలు గుడ్డినమ్మకాలతో ఎలా మోసపోతున్నారో తెలుస్తుంది. ఒక హెచ్చ రికగా వుంది కూడాను.

హాస్యం అనగానే సినిమాల్లో బ్రహ్మానం దం గురించి చెప్పినట్లే, మన తెలుగు సాహి త్యంలో తెనాలి రామకృష్ణుడి గురించి చెప్పు కోవాల్సిందే. రామకృష్ణుడు అనగానే శ్రీకృష్ణ దేవరాయల వారి గురించి చెప్పుకోవాలి కదా! ఇంతకూ కథ ఏమిటమంటే శ్రీకృష్ణ దేవ రాయల వారి తల్లి మామిడి పండూ మామి డిపండూ అంటూ శ్వాస విడిచింది. అది మామిడిపండ్ల సీజన్ కాదు మరి. ఏం చేయాలి అని అడిగితే బంగారు మామిడి పండ్లు పంచవచ్చునన్నారు. సరే రాయలు వారు రెడీ అయ్యారు. ఇంతలో మన రామకృష్ణుడికి ఈ విషయం తెలిసి, తన తల్లికి వణుకుడు రోగం వుందనీ, అది వాతలు పెడితే తగ్గుతుందనీ, అందరికీ వాతలు పెట్టి మరీ రాయలవారి వద్దకు పంపుతున్నాడు. రాయలు వారు చివరికి అడగాల్సి రాగా, అయ్యా తమరి తల్లి స్వర్గానికి వెళ్ళే ఏర్పాటు తమరు చేస్తున్నారు, నా తల్లి స్వర్గానికి వెళ్ళే ఏర్పాటు నేను చేస్తున్నాను అన్నారట. రాయలవారి ఖజానా రక్షింపబడింది. కథ బాగున్నా ఎప్పుడో ఎవక్కడో విన్నట్లుగా వుంది కదా?

'మీరెవరు?' అన్న కథ ఫోను కాల్స్ గురించి, ఒక్కోసారి ఒక్కొక్కరు క్రాక్స్‌లాగా మాట్లాడి విసిగిస్తారు. నిజానికి ఇదొక హాస్య సన్నివేశాలుగా సినిమాల్లో కూడా చూపిం చడం కద్దు. మన చంద్రకుమార్‌గారు కూడా అలాగే మనలను నవ్వించే ప్రయత్నం గావిం చారు.

వశిష్టుడు బ్రహ్మర్షి. ఆయన భార్య అరు ంధతి. ఆమె మాదిగ (దళితస్త్రీ). వశిష్టుడికి, ఊర్వశికి పుట్టిన వాడే శక్తిముని. శక్తు ముని భార్య అదృశ్యంత మాల. వారి కుమారుడే పరాశరుడు. పరాశరుడు బేస్త కన్య సత్యవతి (మత్స్యగంధి)ని ప్రేమిస్తే శ్యాసుడు పుట్టాడు. ఇలా వ్యాసుల వంశమంతా కులాంతర వివాహాలు చేసుకున్న వారే. ఆ రోజుల్లో కులమని చూడలేదు. వారి జ్ఞానాన్ని, తపస్సును చూసారు. అమితమైన ప్రజ్ఞ కలవారు కాబట్టి వ్యాసుడు మహాభారతాన్ని రాశాడు. భాగవతం వ్రాశాడు. ఇవన్నీ వ్రాసింది ఒక బెస్త స్త్రీ కొడుకు. అతడే వ్యాసు డు. ఆనాడు కులాలు లేవు. రామాయణాన్ని రాసింది వాల్మీకి. ఇలా కాసుకొచ్చారు జస్టిన్ బి.చంద్రకుమార్ గారు, **'భారతంలో కులాం తర పెళ్ళిళ్ళు'** అన్న కధలో. గీతలో కుల ధర్మం పాటించాలని కృష్ణుడు చెప్పాడు కదా అన్న ప్రశ్నకు చంద్రకుమార్‌గారు చెప్పించిన విషయాలు మనం అందరం ఒక్కసారి తామీగా ఆలోచించాలి. కృష్ణుని భార్య జాంబవతి ఆటవిక స్త్రీ. కృష్ణుడు యాదవుల కూతురిని పెళ్ళి చేసుకోలేదా? కృష్ణుడు యాదవుల ఇంట్లో పెరగలేదా? కృష్ణుని చెల్లెలు సుభద్ర. యాదవుల కూతురుకాదా? సుభద్రను అర్జునుడు పెళ్ళి చేసుకోలేదా? నేటి కాలంలో ఇందిరాగాంధీ మొదలు అనేక మంది కులా ంతర, మతాంతర వివాహాలు చేసుకున్నారు. ఇక రచయిత విశ్వామిత్రుడి విషయం, మేనక, భరతుడి విషయాలు ప్రస్తావించారు. ఇక వారు భగవంతుని కులమేమిటి? భతవంతుని మతమేమిటి? ఈ ఆచారాలన్నీ మనం కల్పించుకున్నవి. ఒకప్పుడు వృత్తులను బట్టి కులాలు వచ్చాయి. ఇలా తెలయజేస్తూనే, ఈనాడు సమాజం మారింది. డాక్టర్లు, కంప్యూటర్ ఇంజనీర్లు, టీచర్లు, పైలెట్లు, డ్రైవర్లు ఇలా అనేక కొత్త వృత్తులు వచ్చాయనీ, ఇప్పుడు వారి వారి పనులు మారిపోయా యనీ, పాత తరం ఆలోచనలు మారుతున్నా యనీ, సపతరం కొత్తగా ఆలోచిస్తున్నారనీ మనం అర్థం చేసుకోవాలి అంటూ వివరిం చారు. ఇలాంటి కథలూ, వాటిలో ఏమాత్రం సంకోచం లేకుండా, ఈ సంఘం ఎదుర్కొం టున్న అత్యంత క్లిష్టమైన సమస్య కులం, కులం, కులం. దీన్ని ఇంత వివరంగా మన రచయిత ఆవిష్కరించడం ఒక విధంగా వారి చైతన్య ప్రధమైన ఆలోచనలకు ఒక రూపం కల్పించింది. అంటే సాహిత్యంతో బాటుగా సమాజ చైతన్యాన్ని ఆశించడం వారికి కొట్టిన పిండిగా మారింది. సమాజం, మా నవ అసమానతలపై ఎక్కుబడిన బాణంగా ఈ 'అవీ ఇవీ'ని నేను విశ్లేషిస్తాను. ఈ కథలను హాస్య కథలని ఎందుకన్నారో నాకైతే అర్థం కావడం లేదు.

ఈ కథలన్నీ యువతకు ము ఖ్యంగా చదవాల్సిన కథలు. మనం చదవాలి, ఇతరుల చేత చదివిం చాలన్న ఆచార్య మసన చెన్నప్ప గారితో నేను ఏకీభవిస్తాను. సమాజ హితం కోరి వ్రాసిందే ఈ **'అవీ ఇవీ'** పుస్త కంలోని కథలు. చంద్రకుమార్ గార్కి నా అభినం దనలు, నమస్సులు.




- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

"శేషేంద్రను చదవడం అంటే కేవలం వారి కవిత్వాన్ని ఆస్వాదించడం కాదు, ప్రజాస్వామ్య బాధ్యతలపై పునరాలోచించే చారిత్రక సందర్భం"

శేషేంద్ర సాహిత్యానికి అక్షర నీరాజనం !

భారతీయ సాహిత్య ధ్రువతార గుంటూరు శేషేంద్ర శర్మ గారి శతజయంతి ప్రత్యేక సంచికను " కవిర్విశ్వో మహాతేజా " అనే పేరుతో డా. బులుసు వేంకట సత్యనారాయణమూర్తిగారి సంపాదకత్వంలో శ్రీ కళాగౌతమి సంస్థ వెలువరించింది.1927 అక్టోబర్ 20న జన్మించిన శేషేంద్ర గారికి ఇది శతజయంతి. తన వద్యంతో, ప్రవచనంతో, వచన కవిత్వంతో, మైజ్ఞానిక.. విమర్శనాత్మక వ్యాసపరంపరలతో, దివ్య సుందర రూపంతో, నవ్య సంప్రదాయ నేపథ్యంతో, విప్లవాత్మక భావజాలంతో తెలుగు సాహిత్యంలో ఆయన ముద్ర ప్రస్ఫుటం. అలంకార శాస్త్రాలను ఔపోసన పట్టిన పండితుడై, రసభరితమైన కవిత్వంలో విశ్వమానవ దృష్టిని నిక్షిప్తం చేసిన ఆ మహాకవిపై లబ్ధప్రతిష్టులైన సాహితీ వేత్తలు రచించిన వ్యాసాలను , వివిధ పత్రికలు సమర్పించిన నివాళులను ఈ సంచికలో పొందుపరిచారు.



శేషేంద్ర శర్మ కవిగా, విమర్శకునిగా దార్శనికునిగా వింధ్య పర్వతం లాంటి వారని ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక నివాళులు సమర్పించింది. వచన కవిత్వానికి కొత్త వాకిలి తెరిచిన స్వతంత్రులని ఆజోవిభో ప్రచురణలు ప్రకటించింది. కావ్య భాషా స్వరూపంలో మార్పు తెచ్చిన ఆధునిక వాగనుశాసనుడు శేషేంద్ర అని ఆచార్య పేర్వారం జగన్నాథం గారన్నారు. ఆయనను ప్రపంచ కవితా చక్రవర్తిగా త్యాగరాయ గాన సభ కీర్తించింది. సమాజం లోని అన్ని పార్శ్వాలను తన కవితా మాధుర్యంతో స్పృశించి నూతన అంశాలను ఆవిష్కరించిన మహాకవి శేషేంద్ర గారని మూసీ పత్రిక ప్రశంసించింది.

శేషేంద్ర "కవి సేన మేనిఫెస్టో" గురించి గన్ను కృష్ణమూర్తిగారు రాసిన వ్యాసంలో.. ఆయన వాక్యాలు ఏ దివ్య లోకాలనుండో దిగి వచ్చిన తేజఃపుంజాల్లా కనిపిస్తాయ న్నారు. ఇదే గ్రంథంపై స్పందిస్తూ అన్ని కాలాలకు, అన్ని కలాలకు పాఠ్య గ్రంథం కవిసేన మేనిఫెస్టో అంటారు డా.బీరం సుందర రావు. శేషేంద్ర కవిత్వంలోని ప్రతి వాక్యం పాఠకులను ఆకర్షిస్తుంది, ఆలోచింపజేస్తుంది అంటారు బాణాల మన్మధ రెడ్డిగారు.

'శేషేంద్రను చదవడం అంటే కేవలం వారి కవిత్వాన్ని ఆస్వాదించడం కాదు, ప్రజాస్వామ్య బాధ్యతలపై పునరాలోచించే చారిత్రక సందర్భం " అంటారు ఆచార్య మాడభూషి శ్రీధర్. సామ్యవాదాన్ని రేఖా మాత్రంగా తీసుకొని కవిత్వం రాసిన స్వదేశీ మార్క్సిస్టు కవి శేషేంద్ర అంటారు ఎ. రజా హుస్సేన్.

రామాయణ పరమార్థమే యోగ సాధన అని శేషేంద్ర "షోడశి" నిర్ధారించిందని, రామాయణానికి హృదయంగా భావించే సుందరకాండలో ఉన్నది సాంకేతిక పరిభాషలో నిక్షిప్తమైన కుండలినీ యోగమేనని , పరమ భాగవతోత్తములకే అంతుచిక్కని ఎన్నెన్నో రామాయణ రహస్యాలను వెలికితీసి, వాల్మీకి మహర్షి రచనలో అంతరార్థాలను ఆవిష్కరించడంలో శేషేంద్ర పాండితీ ప్రకర్ష బహిర్గతమవుతుందని సినీ రచయిత డా.వెనిగళ్ల రాంబాబు కొనియాడారు.

శేషేంద్ర హరిచందన శిల్పం వంటి వారిని,ఆయన ఆపాద మస్తకం కవి అని, ఆ కాయానికి ఎక్కడ గాయమైనా కవిత్వమే స్రవిస్తుందని అంటారు డా. కల్వకుంట్ల రామమూర్తి . అద్వితీయ ప్రతిభా సంపన్నులైన శేషేంద్ర సినిమా రంగం వైపు దృష్టి సారించికపోవడం విశేషం. వారు రచించిన ఒకే ఒక్క సినిమా పాట బాపు దర్శకత్వంలో వచ్చిన "ముత్యాల ముగ్గు" చిత్రం లోని " నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది ". కేవీ మహదేవన్ స్వరపరచగా పి. సుశీల గారు ఆలపించిన ఈ పాట పుట్టు పూర్వోత్తరాలను వివరిస్తూ శేషేంద్ర గారి కుమారుడు సాత్యకి వ్రాసిన వ్యాసం ఆసక్తికరంగా ఉంది. జన వంశం కావ్యం ఆధునిక కవితా క్రీడాభిరామమని సన్నిధానం నరసింహ శర్మ గారు రాసిన వ్యాసం, మూడు లోకాలు ఆక్రమించిన కవిత్వ త్రివిక్రమత్వం శేషేంద్ర సాహిత్య జగద్విహారం అంటూ లాయర్ వార పత్రిక (నెల్లూరు) అందించిన వ్యానం శేషేంద్ర సాహిత్యంపై మంచి విశ్లేషణలే.నిప్పులు చిమ్మే, అమృత ధారలు కురిపించే రసరమ్య కవితా పాదాలు, పంక్తులు శేషేంద్ర సాహిత్యంలో కోకొల్లలని, వాటిని చదువరులు అక్షర నక్షత్రాలుగా పదిల పరచుకోవాలని ప్రొఫెసర్ రమా చంద్రమౌళి అన్నారు.

శేషేంద్ర గౌరిల్లా కావ్యాన్ని సామ్యవాద సాహిత్య శిల్పంగా అభివర్ణిస్తూ డా.వెనిగళ్ల రాంబాబు రాసిన వ్యాసంలో .. శేషేంద్ర తన సాహిత్యంలో అప్సరోభామినులను అలంకరించలేదని, రాసలీలలను రసరమ్యంగా వర్ణించనూ లేదని, ఆయన తన కవితాత్మక పదమాలికలను కార్మిక కర్షకులకు కండువాలుగా కప్పారని, ఆత్మ గౌరవంతో తలెత్తుకొని తిరిగే తలపాగాలుగా చుట్టారని , అదే శేషేంద్ర సంకల్పమని కీర్తించారు.

శేషేంద్ర కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే సహృదయత ఉంటే చాలు, కానీ శేషేంద్ర విమర్శలోని లోతులను అర్థం చేసుకోవాలంటే ప్రతిభతో పాటు వ్యుత్పత్తి అభ్యాసాలు మెండుగా ఉండాలంటారు డా.అద్దంకి శ్రీనివాస్ .కాలం ఎగరేసిన పతాకం శేషేంద్ర అంటారు వి.వి.ఎస్. శేషేంద్ర కవిత్వం అన్ని పార్శాలను ప్రతిఫలించింది అంటారు డా.దిలావర్. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి చిన్నపరెడ్డి గారు శేషేంద్రుని విశ్వకవీంద్రునిగా దర్శించారు.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ధ్యేయాలుగా సాగే మార్గంలో గురజాడకు తోడు శేషేంద్ర అంటారు ఆర్.ఎస్. సుదర్శనం. ఇంకా కాశ్యప్, సాగర్ శ్రీ రామ కవచం రాసిన వ్యాసాల్లో శేషేంద్ర వ్యక్తిత్వ పరామర్శ ఉన్నతంగా సాగింది. శ్రీశ్రీ ,తిలక్ , శేషేంద్రలను నవ్యాధునిక కవిత్రయమంటారు డా. శ్రీపాద కృష్ణమూర్తి. వచన కవిత్వం దిశను మార్చిన సమాంతర స్పాప్నికుడు శేషేంద్ర అంటారు శ్రీ అప్పర్.

ఇరువైపులా శేషేంద్ర ముఖచిత్రాలతో ఆకర్షణీయంగా రూపొందిన ఈ సంపుటిలో శేషేంద్ర తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, తాను జన్మించిన ఇంటి ఫోటోలతో శేషేంద్ర కవితలతో,పద్యాలతో సర్వాంగ సుందరంగా ఉంది.

ఈ ప్రత్యేక సంచిక శత జయంతి శేషేంద్రునికి సమర్పించిన ఓ అక్షర సుమం.

శేషేంద్ర సారస్వత విశ్వరూపాన్ని విహంగ విన్యాసంగా దర్శించడానికి అనువైన ఓ కరదీపిక !

ఏ.వి. ప్రసాద్

ఆద్యకళ మ్యూజియం ఏర్పాటు నీలమ్మకు అసలైన నివాళి



నీలమ్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న సుంప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి. వేదికపై కె. శ్రీనివాస్, కె. రామచంద్రమూర్తి, బి.యస్.రాములు, కొండంరాం, సజయ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): ఆద్య కళ అపురూప సంపదను పరిరక్షించడంలో నీలమ్మ ప్రధాన పాత్ర పోషించారని వక్తలు కొనియాడారు. ఆచార్య జయధీర్ తిరుమలరావు చరిత్ర పరిశోధన జీవితంలో ఆయన సహచరి నీలమ్మ నిశ్శబ్ద ఉద్యమకారిణిగా పనిచేశా రని ఆద్యకళ మ్యూజియం ఏర్పాటే ఆమెకు అసలైన నివాళి అని ఉద్ఘాటించారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా **'కళల కాపరి- నీలమ్మ'** స్మారక సంచికను 19 గురువారం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రజల సంస్కృతికి ప్రతీకలైన ఆద్యకళ వస్తువుల ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించలేకపోవడం శోచనీయమన్నారు. సీనియర్ పాత్రికేయులు కె. శ్రీనివాస్, కె. రామచంద్ర మూర్తి, ఎమ్మెల్సీ కోదండరాం, అరుణోదయ విమలక్క, బి.యస్.రాములు, కొల్లాపురం విమల, కొండవీటి సత్యవతి, కె. సజయ, గూడూరు మనోజ, ఏకే ప్రభాకర్, కొలకొండ సుబ్బాచారి, రాపోలు సుదర్శన్, క్రాంతిదళ్ పృథ్వీరాజ్, మట్టిమనిషి పాండు తదితరులు పాల్గొన్నారు. విశాలమైన బహుముఖీనమైన వ్యక్తిత్వం నీలమ్మ సొంతమంటూ వారంతా ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జానపద కళాకారులు పాటలతో నివాళి అర్పించారు.

పక్షాంత కవితా పరిమళాలు...

‘గజల్ అంటే కవిత్వ సారాంశం. అభివ్యక్తి, భంగిమ, విన్యాసం, సొగసుల సమ్మిళిత కళ. అయిన వాళ్ళు మెచ్చుకోళ్ళకు దూరంగా విస్తృతంగా భావోద్వేగాలను ప్రయుక్తం చేయడం.’

ఎడారి సికరి వెన్నెల్లో తడుస్తూ గానించే హృద్యగీతం
మనిషి ఎదలో ఎగసే తాత్వికతా గీతం
.....
మనసు మూలాలను స్పృశించి రసప్లావితం చేసే తన్మయ గీతం
మరువలేని స్మృతులను సవరించే విషాద గీతం...

ఉపోద్ఘాతంగా తన గజళ్ళ లక్షణాలేంటో హృద్యంగా, అనవద్య కవితాత్మ స్పర్శగా వివరించారు పక్షాంత గజల్ కావ్య కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి.

తాత్వికత కవితను ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది. తాత్వికతను గర్భీకరించుకోని కవిత .. అది గజలైనా ? మరే ప్రక్రియ అయినా ఉత్త బోలుగా తేలిపోతుంది. ఇక మరువలేని స్మృతులను సవరించే విషాదగీతం గజల్ అంటుంది కవయిత్రి.

‘జో ఖో జాతా హై మిల్ కర్ జిందగీమే
గజల్ హై నామ్ ఉస్కా షాయరీమే’

‘అంటే జీవితంలో పొందిన దానిని దేనినైతే కోల్పోతావో కవిత్వంలో దానిపేరు గజల్’ అన్నమాట.

గజల్ ను అలీ అహ్మద్ సురూర్ ఈ విధంగా వర్ణించాడు.

‘గజల్ అంటే కవిత్వ సారాంశం. అభివ్యక్తి, భంగిమ, విన్యాసం, సొగసుల సమ్మిళిత కళ. అయిన వాళ్ళు మెచ్చుకోళ్ళకు దూరంగా విస్తృతంగా భావోద్వేగాలను ప్రయుక్తం చేయడం.’

‘గజల్ ఒక వేణువు. మనిషి తన జీవితంలో తీరికలేని తనంతో హడావుడిలో ఏ కళాత్మక విలువలు కోల్పోతాడో గజల్ కవి ఆ వేనునాదంతో వెదకి వెదకి తిరిగి తీసుకొస్తాడు. ఆ వేణునాద స్వరాల మధురిమలను విన్న భగవంతుడు కూడా మనిషి కోసం ప్రేమాశ్రువులు రాల్చుతాడు’.

అంటాడు ఫిరాఖ్ గోరఖ్ పురి .

ఇలా చెప్పుకుంటూ పోతే చాలా లక్షణాలను ఏకరువు పెట్టాల్సి ఉంటుంది.

ఇక ప్రస్తుతానికి వద్దాం. మల్లీశ్వరిగారు రససిద్ధి పొందిన కవయిత్రి అన్నది జగమెరిగిన సత్యం. పూర్వజన్మ సుకృతం వల్ల కవులకు రససిద్ధి కలుగుతుంది. రససిద్ధి కలిగిన కవుల కీర్తికాయానికి జరామరణ భయాలు ఉండవు కదా. ఆ కోవలోని వారే మన మల్లీశ్వరిగారు.

ఇక పక్షాంత... శుక్లపక్ష చంద్ర కళల మెరుపుల్ని తిలకిద్దాం రండి...

1. ఆశలే రాలినట్టి అద ఒంటరై ఎలా పోతుందో తెలిశావా
‘ఆశలే రాలినట్టి మనసు ఒంటరిదై’ వచన కవిత్వంలోలా మంచి కవితాత్మకంగా ఉంది అభివ్యక్తి.

2. చంద్రవంకల్ల తారల కంకుల్ల శంకు పూగుత్తుల్లా...
ఊహా శబలతకు పరాకాష్ఠ ఈ పాద శకలం.

3 గజలునై ఊహల ఊదొత్తులెన్నెన్ని వెలిగించానో మల్లీ!
భావ సౌగంధ్య సఖ్యాన ఏ మల్లె పొదనయ్యానో తెలుసుకో. ..
వాహ్! ఊహల ఊదొత్తులట... రూపకం మధురాతి మధురంగా ప్రయుక్తమైంది. ఇవి భావగంధం గుబాళించి పాఠకులను మత్తులో ముంచే పాదాలు! ఇది కదారససిద్ధి!

4 ‘అక్షరాల యవనికల మనసు నీడల కదలాడు దృశ్యాలేవో
నక్షత్రాల వెలుగులో కనుల కలల సొదలాడు అర్థాలేవో’
అక్షరాల యవనికలు... ఇలా ఎన్నని చెప్పుకుంటూ పోవాలి. ఉపమానాలు, రూపకాలు, ఉత్ప్రేక్షలు... కృత్రిమంగా కాక సందర్భోచితంగా గజళ్ళలో ఒదిగిపోయి. అయితే ఒక విషయం చెప్పాలి. ఆద, మిహిక, సొద లాంటి పదాల మీద కవయిత్రికి మోహమేమో.. అవన్నీ ఆమె హృద్యమైన రసప్లావిత హృదయానికి సంకేతం.

5. ‘నా ఆదే నీ వయ్యారి ఊహల పూల తోటే కదా



– రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
9866583907

నీ ఎద ఏషల జ్వాలని ప్రేమల మాలిని తెలుసా’
అదిగో ‘ఆద’ మళ్ళీ వచ్చింది. మనసే వయ్యారి ఊహల పూదోట అట. ‘ఏషల’ అంటే కోరికల ... పంటి తేనెలొలుకు మాటలెన్నో . పదాల హృదయం తెలుసుకోలేని కవి రచన పేలవంగా ఉంటుంది. మల్లీశ్వరిగారు పేలవానికి ఆమడ దూరం!

కవితల కొమ్మనై రమ్మని అమ్మ పాటనై మితోనే తెలుసా తెలుగు భాష మాధురినెలా పాడకుంటానో



-డా॥దిలావర్
సెల్:9866923294

అంటూ తెలుగు భాషా సౌందర్యాన్ని, ప్రాశస్త్యాన్ని అందమైన పదాల పోహళింపుతో రక్తి కట్టించారు కవయిత్రి.

7. స్వప్నమై ఏ కన్నుల సుతారంగా నే వాలానో
స్మితమై ఏ పవడపు పెదవుల ప్రేమ మీర మెదిలానో

పువ్వు మీద సీతాకోకచిలుక వాలడం మనకు తెలుసు. ఇక్కడ స్వప్నమై కన్నుల వాలిందట. భేష్. ఇది కదా కవిత్వమంటే...

‘అక్షర వర్ణమై స్వాంతాలకు సాంత్వనానందమిస్తా
కోరి కోరి కొంగ్రొత్త తలపు మొలకలకే జన్మమిస్తా’
అని అంటుంది పక్షాంతలో కవయిత్రి. కోరి కోరి తలపు మొలకలకు జన్మమిస్తుందట. రూపకం ఎంత అందమైన రూపంలో ప్రయోగింపబడిందో. కవిత్వానికి కొత్త సొబగులద్దేది అలంకారికత. అలంకారాలో, అభివ్యక్తో లేకపోతే అది శుష్క కవిత్వమవుతుంది.

‘రోజు రోజుకూ పూసే విరుల సరుల కురిసే మరులెన్నో
నవ్యత నింపుకున్న ఉదయ సౌందర్య మహత్తెంత కొత్తాతోందో’
విరుల, సరుల, కురిసే, మరులెన్నో ..అనే చోట ‘ర’ కారం ఆవృతమై కొత్త వన్నెలు విరజిమ్ముతోంది. ఉదయం సౌందర్యం అందాలకు ముగ్ధరాలై తన్మయత్వంతో రాసింది ఈ పాదాన్ని.

10.‘కల్వరేకులంటి నా కళ్ళకు ప్రేమనె కన్నీటి కానుకిచ్చి
కరిగె కాలాన మిన్నంత నా ఎదలో దొర్లేసింది ఎవరో’
ప్రేమనే కన్నీటి కానుక నిచ్చారట ఎవరో... కన్నీటి కానుక.. అనడం కొత్త ప్రయోగమే... మిన్నంత నా ఎదలో... ఎద వైశాల్యానికి చిహ్నంగా ఆకాశాన్ని చెప్పడం ఔచిత్య భరితంగా ఉంది.

‘ఎవరినో... ఎవరినో... ఏ పిచ్చిగాలి ఎదనయానో తెలుసుకో
ముసిరే మిహికను హర్షించని ఏ పూరొద నయానో తెలుసుకో’
పిచ్చి గాలి ఎదనయానో... అని అనటం బాగుంది. ఇది నవనవోన్మేష ప్రయోగమే... ‘ముసిరే మిహికను హర్షించని ఏ పూ రొదనయానో’ అంటుంది మరోచోట. ముసురుకునే మంచును హర్షించని పూరొద అయిందో... ఎంత సొగసుగా తెలిపింది! తాను పూరొద కావడం అందమైన అభివ్యక్తి.

12. ‘నీ వ్యామోహన తడిసె వయసు వాజి వల్లంకి పిట్టనని
రేకులు విరిసే వెన్నెల వెలిగేటి విరజాజినని తెలుసా’
వయసు వాజి వల్లంకి పిట్ట. వాజి అంటే చాలా అర్థాలున్నాయి. గుఱ్ఱము, పక్షి (వేగము) మొ. తొందరపెట్టే వయసు వల్లంకి పిట్ట ? మధురోహల పరిమళం అంటే ఇదే. ‘వయసు వల్లంకి పిట్ట’ అనేది చక్కని ఉత్ప్రేక్ష. ఇక్కడ చిన్న వివరణ?

ప్రేమ అనేది లేకపోతే గజల్ ను ఎవరు రాస్తారు?

బురదలో ఉన్న పువ్వును ‘కమలం’ అని ఎవరు పిలుస్తారు? అని అంటాడో ఉర్దూ గజల్ కవి.

‘గజల్ ఒక వేణువు. మనిషి తన జీవితంలో తీరికలేని తనంతో హడావుడిలో ఏ కళాత్మక విలువలు కోల్పోతాడో గజల్ కవి ఆ వేనునాదంతో వెదకి వెదకి తిరిగి తీసుకొస్తాడు. ఆ వేణునాద స్వరాల మధురిమలను విన్న భగవంతుడు కూడా మనిషి కోసం ప్రేమాశ్రువులు రాల్చుతాడు’.

కరువు చిత్రం కళ్ళ ముందు జ్ఞాపకం

ఇది వేసవి కాలమా
వానా కాలమా? ఎక్కడో ఒక మేఘం వర్షిస్తుంది
అది నగరం నడి నెత్తిపై వర్షిస్తుంది
ఏం ప్రయోజనం
కాలం ఇప్పుడు కనీసం కనికరించడం లేదు
ఏ మేఘము కొరియడం లేదు కురిసిన
అనవసరము చోట
బల్లమని బ్రద్దలవుతుంది మేఘాలకొండ
అసలే నీటి కరువు బడి పిల్లలకు ఒక్కపూట బడి
ఇంకొందరికి ఇంటి నుంచి
పని అంతా కాలం మాయాజాలం
ప్రకృతిని నీవు విధ్వంసం చేసినన్ని రోజులు
అది నీకు ప్రతి కారం
చేస్తూనే ఉంటుంది
తస్మాత్ జాగ్రత్త ప్రకృతితో చెలగాటమాడకు
ప్రకృతిని మాతగా వనమాతగా
కాపాడుకొని కొలిచినన్ని రోజులు
అది నిన్ను కాపాడుతుంది.



-డా॥అంజనా శ్రీ
7702537453

అక్షరాయుధం

నా కవితలు
అన్యాయానికి ఎదురేగి
ప్రశ్నలై నిలబడతాయి.
నా కవితలు
నిశ్శబ్దాన్ని ఛేదించి
రేపటి పౌరుల గొంతుల్లో
నినాదాలై మార్మోగుతాయి.
నా కవితలు
దౌర్జన్యాల దురహంకారాన్ని
ధిక్కరించి నిలదీస్తాయి,
అధికారపు అహంకారాన్ని
అక్షరాలతో ప్రశ్నిస్తాయి.
నా కవితలు
అరాచకాల అంధకారంలో
అహింసా దీపాలై వెలుగుతాయి,
రక్తపు నేలపై
శాంతి కపోతాలై ఎగురుతాయి.
అందుకే
నా కవితలు అందరికీ
అనిర్వచనీయమైన అనుభూతులై,
చదివిన ప్రతి హృదయంలో
ఒక ప్రశ్నగా
ఒక నినాదంగా
ఒక ఆశగా
ఒక మార్పుగా మిగిలిపోవాలి!.



-బండ్ల తరకేష్
6369377140

మరచిపోతున్న మనం

అహం అనే అగ్నికి ఆజ్యం పోసి...
దూరం చేసుకుంటూ బంధాలు వదిలేసి...
ఎవరికి వారే అనేలా గడిపే జీవితం...
ఈనాటి టెక్నికల్ జీవన విధానం...
అన్నదమ్ముల మధ్య లేదు ఆప్యాయత...
అక్క చెల్లి మధ్య కనిపించని మమత...
అన్నా చెల్లి ఎప్పుడూ దూరమే కదా...
కుటుంబ విలువలు మాయమై పోయాయి...
పెద్ద వారమంటూ అహంతో పెద్దలు...
చిన్న వారిపై కనిపించని ప్రేమలు...
మౌనంతో పెరుగుతున్న దూరాలు...
కలిసినా కనపడని రక్త బంధాలు...
కుదించుకు పోతున్న కుటుంబం...
కోపంతో పెంచుకుంటున్న అహం...
గుండె లోతుల బాధ కనిపించకుండా...
క్షమించు అని
ఒక్కసారి అంటే అదే కదా అండ...



-షామీర్ జానకీదేవి
9394611037

కనువిప్పు

(కథ)

రంగ చదువులో చాలా వెనుకబడి ఉండేవాడు. వారికి ఎప్పుడూ ఆటల పిచ్చి. ఇంటికి వచ్చాడంటే పుస్తకాలు సంచి ఇంట్లో పడేసి, బయటికి వెళ్లి స్నేహితులతో పనికిరాని ఆటలు. సెలవు రోజుల్లో కూడా ఇంటి పక్కన ఉండడు. రంగ తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్లడం వల్ల రంగా ఎలా చదువుతున్నాడో పట్టించుకోవడం లేదు. ఎప్పుడో ఓసారి “ఎలా చదువుతున్నావురా రంగా?” అంటే “మా తరగతిలో అందరికంటే నేనే తెలివైన విద్యార్థిని.” అని కోతలు కోసేవాడు.

ఇప్పుడు రంగ 9వ తరగతి. ఒకసారి రంగ తండ్రి సురేంద్ర పాఠశాలకు వచ్చాడు. తన కొడుకు ఎలా చదువుతున్నాడు అడిగాడు. “చదువులో చాలా వెనుకబడి ఉన్నాడు. ఇంటి పనులు కూడా ఎప్పుడు చేయడు.” అని అన్నారు ఉపాధ్యాయులు. తన నిర్లక్ష్యానికి తనను తానే నిందించుకున్నాడు సురేంద్ర. ఇకనుంచి అయినా కొడుకు చదువు గురించి పట్టించుకోవాలని అనుకున్నాడు.



ఆరోజు సాయంత్రం ఇంటికి వెళుతూ రంగ తన స్నేహితుడు సోముతో “నిన్న క్రికెట్ మ్యాచ్ చూశావనుకుంటా. మన దేశం ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడిపోయింది. ఒకరిద్దరు బ్యాట్స్ మన్ తప్ప అందరూ ఫెయిల్ అయ్యారు. నాకు బాగా నిరాశ కలిగింది. ఇంటికి వెళ్తే నిద్ర పట్టలేదు.” అన్నాడు. అక్కడే ఉన్న అపర్ణ అనే తెలివైన అమ్మాయి సోముతో ఇలా అన్నది. “క్రికెట్లో ఎన్నో అంచనాలు పెట్టుకున్న మన ఆటగాళ్లు ఫెయిల్ అయ్యారని రంగకు నిద్ర పట్టలేదు. మరి చదువులో కూడా మన మీద మన తల్లిదండ్రులు చాలా ఎక్కువ అంచనాలు పెట్టుకుంటారు. మరి మనం చదువులో చాలా వెనకబడ్డామని తెలిసి, మన తల్లిదండ్రులు ఇంకా ఎంత నిరుత్సాహపడాలి? నిన్న రంగకు నిద్ర పట్టలేదు. ఈరోజు రంగ తల్లిదండ్రులకు నిద్ర ఉండదు. మరి వారి బాధ ఎలా తొలగుతుంది?” అని. రంగ తండ్రి ఈరోజు వచ్చి, రంగ చదువు గురించి తెలుసుకొని వెళ్లాడని చెప్పింది అపర్ణ.

రంగ ఆలోచనలో పడ్డాడు. అవును నిజమే. తన చదువు గురించి తెలిసిన తల్లిదండ్రులు ఎంత బాధ పడతారో! ఇకనుంచి అయినా ఇంటి పట్టున ఉండి, తన చెల్లెలు ప్రవంతిలా కష్టపడి చదవాలని నిర్ణయించుకున్నాడు రంగ.



-సరికొండ శ్రీనివాసరాజు.
సెల్.8008848703.

పలక

నా పలక నిండిపోయింది
ఏం చెయ్యను?
అందుకే మొత్తం చెరిపేసాను
ముందుముందు రాసుకునేందుకు
నాకు జాగా కావాలిగా మరి!
అందులో
నా ఆనందాలు, బాధలు,అవమానాలు
ఎన్నో ఎన్నో రాసుకున్నాను
తప్పులు జరిగితే చెరిపి ఒప్పులు రాసుకునేదాన్ని
కానీ నేను మళ్ళీ రాసుకునేందుకు
నా పలకని శుభ్రం చెయ్యక తప్పలేదు
అందుకే మొత్తం చెరిపేసాను
మళ్ళీ రాయటం మొదలుపెట్టాను
మళ్ళీ నా పలక నిండిపోయింది
చివరికి నాకు అర్థం అయింది
జీవితం ఒక నిండు పలకని.
ఎప్పటికప్పుడు తుడుపుతూ పోకపోతే
నిండు నూరేళ్ళుగా గడపాల్సిన జీవితాన్నే
తుడిపెయ్యాల్సి వస్తుందని.
ఈనాడు నా వృద్ధాప్యంలో
నేను నా పలకను తుడిచి
చాలా కాలమే అయింది.



-గరిమెళ్ల కాశీఅన్నపూర్ణ
9618586277

గురువు

గురువును మించినట్టిదియు కొత్తది యేది జగాన లేదురా
పరపతి బెంచి మంచినిల బంచును రాగ విరంజితమ్ములన్
ధరణి వెలుంగు విద్యయు విధాతకునైనను నేర్పు నొజ్జయే
కరముల నెత్తి మెప్పుగను కమ్మగ గొల్తును నేడు గొప్పగన్.
గూగులు యేమి నేర్పునయ గుర్వుల కన్నను లోకమందునన్
సాగదు ముందుకు సరిగ ఛాత్రుల బ్రుర్రను సానబెట్టునా!
ఆగములే గదా! జగతి యాపదలుర్విని పొందు శిష్యులే
జాగరుకమ్ములై గురువు ఛాత్రు భవిష్యతు తీర్చిదిద్దురా!!
ఓపిక తోడ నేర్పు గద నొజ్జయు గొప్పగ యోర్పుతో నిలన్
కోపము లేక మెప్పుగను కోరిన యట్లుగ తీర్చిదిద్దగన్
పాపము బాపినట్లు మరి బాధ్యత తోడను విద్య నేర్పుగన్
రేపటి పౌరులందరును రీతిగ నీతిగ నిల్చునే భువిన్.
కపటము లేక గొప్పగ నిఖార్సుగ నీతిగ ఖ్యాతి బెంచగన్
సఫలము జెంద జేయగను సారె గదా!నిలయందు జూడగన్
ఉపనయనమ్ము జేయగను నొజ్జ విరించి విపంచి గానమై
అపరిచితమ్ము లైనను యయాచిత మందను జేయు మెప్పుగన్.
గూగులు నేర్పలేదు గద గొప్ప గుణమ్ములనే మరీ మరీ
ఓగులు నెన్నియో జరుగు ఒజ్జయు లేకను నాశనంబులున్
బాగుగ లోకమందునను పాడగు ఛాత్రుల మేధయంతయున్
భాగమునౌను విశ్వమున భావితరమ్ముల బాగు జేయగన్.



-పెరుముల కైలాస్
సెల్:8500609578

అమ్మ ఉంటావులే...!

ఉంటారులే అక్కడక్కడ ప్రేమ మూర్తులు.
పుణ్య దివ్యలు.
అమ్మ అంటేనే...!
నింగి అంతా కన్నీళ్లు ధార పోసిన,
నేలంతా తడిపిన పొద్దుటి
ఓ ప్రేమ విత్తనాల మొలకెత్తిన
మానవజాతి పంట కదా!
పందకు అతి దగ్గర చూపుల్ని అమరంలో
అరుణతార చేసుకున్న,
ఆ.. అమ్మ!
ముగ్గురి విప్లవ యోధ లోచనల కల్ప ప్రేమవల్లి!
ఒకరు.. ఎర్రజెండ మీద పాట పావురం చేసినాడు.
ఒకరు... అక్షరం అగ్ని జన వారధి చేసినాడు.
ఒకరు.. అక్షరాలన్నీ మరగబెట్టి
ప్రజా విప్లవ తోట తోరణము అల్లినోడు.
ముగ్గురి అమ్మల మా అమ్మ
బుచ్చమ్మ.. ఉంటావులే!
మా మది గది వాకిట్లో లేలేత పూల
విప్లవ పరిమళ చెట్టుతో....!



– జనజ్వాల
949163770

కరువు కన్నీళ్లు

మట్టి మనుషులు ఇప్పుడు మస్తు గోస పడ్తాండ్రు
ఏ తనువును తాకినా కన్నీటి సాగరాలే ఉప్పొంగుతున్నాయి
ఏ గుండెను తడిమినా గాయాల వీణలై మోగుతున్నాయి
ఏ కర్షకున్ని కదిలించినా కన్నీటి సుడులే తిరుగుతున్నాయి.
పచ్చటి పైరు కండ్ల ముందే కందిపోతాంటే
పేర్చుకున్న ఆశలు దూది పింజల్లా ఎగిరిపోతున్నాయి
చినుకు లేక కునుకు రాక రైతన్న
ఇప్పుడు బగ్గ రంది పడ్తాండ్రు
మట్టిని నమ్ముకున్న మనిషి ఇప్పుడు
ఒడ్డున పడ్డ చేపపిల్లైతాండు.
ముఖం చాటేసిన మేఘం తోటి వరి చేను
కుతికలలొచ్చి నిలువునా కూలబడ్తాంటే
రైతన్న గుండెలు నెర్రబారిన నేలలవుతున్నాయి
మక్కల చేను నిలువునా మాడిపోతాంటే
రైతన్న తనువులు తగలబడుతున్నాయి
పత్తి చేను వక్కిపోతాంటే రైతన్న ప్రాణం
అంపశయ్యపై ఆవిరైతాంది.
ఓట్ల కోసం పాట్లు పడే ఏలికలు
కర్షకుల కోసం
కాసిశ్మడైనా కనికరం చూపిస్తలేదు
రైతన్నను కరువు నీడలా వెంటాడుతుంటే
ఏలికలు నిట్టాడై నిలబడకుండా
నీటిపై అబద్ధపు రాతలు రాస్తున్నారు
బండెడు బాధల్లో ఉన్న రైతన్నకు
ధైర్యపు లేపనాలను రాయకుండా
పేర్చుకున్న కాసుల్లో కునుకు తీస్తున్నారు
రైతన్న జీవితం ఎప్పుడూ ఎండమావే
ఎగుసం ఎప్పుడూ
ఊదపు గవ్వలే



-తాటిపాముల రమేష్
7981566031

రాధా మోహనాలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో వెంకటప్పయ్య, కామేశ్వరి, రుక్మిణి రచయిత్రి నేదునూరి అనురాధ, కళా జనార్ధనమూర్తి, అనురాధ, జ్యోతి తదితరులు.

హైదరాబాద్, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత్రి నేదునూరి అనురాధ రచించిన **‘రాధా మోహనాలు’** పుస్తకావిష్కరణ సోమవారం గుండవరపు హనుమంతరావు హాలులో జరిగింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

గ్రంథ ప్రచురణకర్త జ్యోతి వలభోజు, ప్రముఖులు వెంకటప్పయ్య, కామేశ్వరి, రుక్మిణి, లక్ష్మీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం"
సంస్థ ప్రతిరోజు
కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన
కొన్ని కవితలను
నేటినిజం పాఠకుల
కోసం ప్రత్యేకంగా
అందిస్తున్నాం..
-సంపాదకులు

సన్నివేశాలే..

ప్రతి ఇంటిలో
భార్యాభర్తలు ఆలోచించే
విషయమే..
కుటుంబ నిర్వహణలో
నిత్యము అనుభవించే వేదనే..
సమాజంలో
మనుగడ సాగించాలంటే
ఆర్థిక వనరు ప్రధానమే..
ఉన్నదానితో
సర్దుకుపోదామన్న
పెరుగుతున్న ధరలే..
పిల్లలు ఎదిగే కొద్దీ
ఊహించని ఖర్చులే..
చిన్న స్థాయి ఉద్యోగి అయినా
ఉన్నతస్థాయి పదవిలో ఉన్న..
స్థాయికి తగ్గ ఖర్చులు అవసరాలే..
సామాన్యుడి జీవితంలో సతమతమయ్యే ఇబ్బందులే..
వచ్చిన ప్రతి రూపాయి క్రమ పద్ధతిలో ఖర్చు పెడుతున్న విధానమే..
అయినా అకస్మాత్తుగా వచ్చి పడే ఆరోగ్య సమస్యలు ఓ కారణమే..
పెళ్లిళ్లు బంధువులు ప్రయాణాలు ఊహించని విషయాలే..
కొంత దాచినా అవసరానికి మళ్ళి ఖర్చు చేయడంలో పొదుపంతా నిరుపయోగమే..
ఏ కోణం నుంచి పరిశీలించిన ఏదో ఒక లోపమే..
సంతోషం సంబరమై ఆనందాన్ని పంచినా అయిపోయిన క్షణం బాధాకరమే..
ఆకస్మిక సంఘటనలకు అప్పులు తిప్పలు తప్పనివే...
కుటుంబ వ్యవహారంలో ఎక్కడ ఖర్చు తగ్గించుకుందామన్న..
అవసరాలు ఉన్న త్యాగభావంతో సర్దుకుపోయిన..
వచ్చే ఆదాయం సరిపోక ఆలోచనలో మునిగే సందర్భమే..
అప్పులు తాకట్టు లోన్లు చేబదుళ్ళతో కుస్తీ పట్టే జీవితాలే..
జీతం జీవితం అవసరం తప్పని పరిస్థితి కనిపించే సన్నివేశాలే..

-డి.బి.హేమంత్ సింగ్
81214 30560

బిల్లుల నీడలో బతుకుబాట

అద్దె, ఈఎంఐల అంతులేని భారంతో
కరెంటు, నీటి బిల్లుల నెలవారీ పోరుతో
నిత్యావసరాల ధరల నిప్పుల సెగతో
సతమతమవుతోంది నేటి మధ్యతరగతి ఇల్లు!.
వైద్య ఖర్చుల పెరుగుతున్న బాధలతో
మందుల కొనుగోలు తీరని అవసరాలతో
కష్టాల లెక్కలు వేసే కాలిక్యులేటరుతో
కరిగిపోతోంది కుటుంబ సంతోషం!.
పక్కనే ఉన్నా పలకరించని మనుషులతో
ఫోన్ తెరలకే పరిమితమైన యువత మనసులతో
గోడలపై మిగిలిన పాత జ్ఞాపకాల మధ్య
దూరమవుతోంది అనుబంధాల ఆత్మీయత!.
బరువుల బాటలో విశ్రాంతి కరువై
సమస్యల సుడిగుండంలో ఆశలు చిక్కుకుని
ఉరుకుల పరుగుల ఉక్కిరిబిక్కిరి జీవితంలో
అందని ద్రాక్షగా మారుతోంది నిశ్చింత!.
కష్టాల చీకటిని తొలగించే ఆశతో
ఖర్చులకు తగ్గట్టుగా సాగించే నేర్పుతో
కుటుంబ సభ్యుల కలయిక, పరస్పర తోడుతో
మళ్లీ చిగురించాలి ఇంట ఆనందపు వెలుగు!.

- పేర్ల దాసు
9963249775

విలువలు లేని బంధాలు

బంధాలు అనుబంధాలు - రక్త సంబంధాలు..
పుట్టుకతో వచ్చే బంధాలు- రక్త సంబంధాలు..
కడుపుచించుక పుట్టుకతో తల్లితో ప్రేగు బంధం..
ఆలనా పాలనతో లాలింపులతో తండ్రితో బంధం..!.
పుట్టుకతో బంధాలు - తోబుట్టువులు..
అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, దాయాదులు...!
పుడుతూ అన్నదమ్ముల బంధాలు..
పెరుగుతూ దాయాదులగా వీర వైరులౌతారు..!.
గూండ్ల నారాయణ
వయసుతో పాటు పెరిగే అనుబంధాలు కొన్ని బంధాలు..
మనసుకు నచ్చిన మిత్ర బంధాలు..
ఊపిరి ఉన్నంత వరకూ వీడని బంధం స్నేహబంధం..
మిత్రునికి అవసరమయితే ఏ త్యాగానికైనా సిద్ధం..!.
జీవితాంతం తోడు కోరుకునే బంధాలు..
జన్మ జన్మల తరించి ఒకటయ్యే భార్యాభర్తల సంబంధాలు..!
కానీ నేడు..
సినిమాల చందాన మారిన బంధాల తీరు..
నమ్మకాలే కరువైన నేటి సమాజపు హోరు..!.
డబ్బు చుట్టూ తిరుగుతున్న మనుషుల ప్రయాణం..
స్వార్థమే సర్వస్వమైన మానవ నైజం..!
విలువలు సన్నగిల్లి, అనుబంధాలు కరిగి..
అవసరాలకే పైపైన పెనవేసే బంధాలు నేడు పెరిగి..,
అవసరాలు తీరగానే తెగిపోయే బంధాలు -కావు బంధాలు..
అనురాగం, ఆప్యాయతలతో నిలిచేవే నిజమైన జీవన వేదాలు..!

-గూండ్ల నారాయణ
+91 94416 78733

కృత్రిమత్వానికి ప్రతీకలు..!!

ఆప్యాయతల పందిరి కింద నవ్వుల పూల తోటలు
కలిసి మెలిసి ఉండే ఉమ్మడి కుటుంబపు సందడులు
అనుభవజ్ఞులైన పెద్దల మాటలు సద్ది మూటలై భవితకు బాటలుగా
కాలం మారిన వేగంలో మసకబారిపోతున్నాయా?
మనుషుల మధ్య దూరాలు పెరిగి మౌనంగా మిగిలిపోతున్నాయా?
ఎదురుపడినా పెదవులపై చిరునవ్వును అతికించుకుని ..
హాయ్! అంటూ తప్పనిసరి అన్నట్టు
కృత్రిమమైన ఆత్మీయతతో కొగిలించుకుంటూ.
మళ్ళీ కలుద్దాం అంటూ శెలవు తీసుకుని వెళ్ళిపోయే నేటి తరం..!
అరచేతిలో ప్రపంచం వచ్చి చేరిన వేళ
పక్కనే ఉన్న మనిషిని పలకరించే తీరిక ఏదీ ఈవేళ?
అనురాగాల ఆలంబనకు అర్థాలే మారిపోయాయా?
రక్తసంబంధాల విలువలు లెక్కల్లోకి వెళ్లిపోయాయా?.
మంచీచెడూ చెప్పే వాళ్ళు లేక
చెప్పినా వినే వాళ్ళు చెవి కెక్కించుకోక
నీకేమీ తెలియదని నోరునొక్కేసే నేటి తరం.
అంతా మాకే తెలుసు, నీకు తెలిసింది శూన్యమని గొంతు పెగలనివ్వకుండా చేస్తుంటే.
చెప్పి భంగపడేకన్నా, చెప్పకుండా మర్యాద నిలుపు కోవడం మిన్నయని భావిస్తున్న ఆ నాటి తరం..!.
చిరునవ్వుల పలకరింపులు, ఆత్మీయపు ఆలింగనాలు,
కష్టసుఖాలను పంచుకునే ఆ తీయని జ్ఞాపకాలు,
యాంత్రిక జీవనంలో కనుమరుగైపోకుండా కాపాడుకుందాం.
ప్రేమ అనే వారధితో మళ్ళీ బంధాలను కలుపుకుందాం.!
ఆస్తిపాస్తులు ఎంత ఉన్నా, ఆత్మీయులు లేని ఇల్లు బోసిపోతుంది.
కష్టమొచ్చిన వేళ కన్నీరు తుడిచే చేయి ఒక్కటే బలాన్నిస్తుంది.
తెరల వెనుక ప్రపంచాన్ని వీడి ఎదురుగా ఉన్న మనిషిని ప్రేమిద్దాం.
అనురాగమే ఆస్తిగా నేటి తరానికి ప్రేమంటే ఏమిటో
చేతలలో చూపిద్దాం.!
డబ్బు, హోదాల కంటే మనిషి విలువ మిన్న అని చాటుదాం
అహం వీడి ఆత్మీయతతో ప్రతి హృదయాన్ని గెలుద్దాం
నేటి తరానికి బంధాల మధురిమల రుచి ఏమిటో చెబుదాం
అనుబంధాల ఆనందాన్ని గ్రోలుతూ
జీవితాన్ని స్వర్గంగా మలుచుకుందాం!!

-డా॥మరుదాడు అహల్య దేవి
98482 38453

జ్ఞాపకాల రేడియో ఇంకా ఆగలేదు. పాత సినిమాల పరదా దిగలేదు..!!



ప్రతులకు: డా॥ఉడుత చంద్రశేఖర్
అమృతవర్షిణి ఆస్తామ, & సిటిపిడి క్లినిక్, 3-7-209/1, జిల్లా కోర్టు ఎదురుఆ, కొత్త గోపికృష్ణ ఫంక్షన్ హాల్, వేవిళ్ళపల్లి, కరీంనగర్-500 001.
సెల్: 9885369200

జ్ఞాపకాల రేడియో ఇంకా ఆగలేదు. పాత సినిమాల పరదా దిగలేదు..!!

''నువ్వు ఎక్కడి నుంచి వచ్చావని అడిగితే.. మనిషి తన ఊరి పేరు చెబుతాడు. కానీ నిజా నికి అతడు వచ్చేది తన జ్ఞాపకాల నుంచే...'' కొందరు కొన్ని పుస్తకాలు చదవడానికి రాస్తారు. ఇంకొందరు కొన్ని పుస్తకాలు గుర్తు చేసుకోవడానికి రాస్తారు. మరికొన్ని పుస్తకాలు మాత్రం మనం మరచిపోయామని అనుకున్న కాలాన్ని మళ్లీ మన ముందు పరచడానికి, మనచేతుల్లో పెట్టడానికి రాస్తారు.

డాక్టర్ ఉడుత చంద్రశేఖర్ వ్రాసిన ఈ జ్ఞాపకాల పుస్తకం అలాంటిది.

ఈ పుస్తకాన్ని చదువుతుంటే నాకుఒక పాత ఇంటి అటక మీదికి ఎక్కిన అనుభూతి కలిగింది. దుమ్ము పట్టిన సందూకుల మధ్య నుంచి ఒకపాత ఫోటో ఆల్బమ్ బయటపడి నట్టు అనిపించింది.

ఆ ఆల్బమ్‌లో ఫోటోలు మాత్రమే లేవు పాటలు ఉన్నాయి

స్వరాలు ఉన్నాయి. వినసొంపయిన రేడియో స్వరాలు, ప్రకటనలు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నాలు విన్న సంక్షిప్త శబ్ద చిత్రాలూ ఉన్నాయి. మ్యాటినీ షో సినిమాకు వెళ్లిన అబ్బాయి కళ్లలో మెరిసిన మెరుపు ఉంది. పల్లెటూరి చీకట్లో రేడియో చుట్టూ చేరిన కుంటుంబం ఉంది. ఒకప్పుడు మన జీవితంలో 'ఆకాశవాణి' ఒక కుటుంబ సభ్యురాలు.

ఉదయం సుప్రభాతంతో తలుపు తట్టేది. మధ్యాహ్నం పాడి పంట, పాటలతో పలకరిం చేది. సాయంత్రం వార్తలు చెప్పేది. రాత్రి నిద్రపుచ్చేది. ఇప్పుడు వందల ఛానెల్లు, వేల పాటలు మన వేలి కొనల్లో ఉన్నా ఆ మెరుపు మాధుర్యం కరువే.

ఆ కాలంలో ఒక పాట వినడానికి మనసంతా ఎదురుచూసేది. ఒక కార్యక్రమం కోసం వారమంతా వేచి ఉండేది. పాట వినిపిస్తున్నప్పుడు ఇంట్లో ఎవరూ పెద్దగా మాట్లాడేవారుకాదు. ఎందుకంటే పాట అనేది అప్పట్లో వినోదం మాత్రమే కాదు జీవితానికి తోడు, ఊరట.

ఈ పుస్తకంలో రచయిత డాక్టర్ ఉడుత చంద్రశేఖర్ ఆ తోడును వెతుక్కుంటూ తన గతంలోకి, అనుభవాల్లోకి, పాత అనుభూతు ల్లోకి వెళ్లాడు. తను పాటలను గుర్తు చేసు కోలేదు.

పాటలు అతన్ని గుర్తు చేసుకున్నాయి.

అలవోకగా జ్ఞాపకం నుంచి కాగితాల మీదికి నడిచి వచ్చాయి.

తను సినిమాలను వెతికి రాయలేదు. తనకు నచ్చిన సినిమాలే అతని జ్ఞాపకాల తలుపు తట్టాయి. ముందు నిలబడ్డాయి. రచయిత డాక్టర్ ఉడుత చంద్రశేఖర్ మనసు ను ఒక పాట తాకితే అది కేవలం సంగీతం

డా॥ ఉడుత చంద్రశేఖర్ రచించిన
" నా రేడియో సినీ జ్ఞాపకాలు"
పుస్తకానికి వారాల ఆనంద్ రాసిన ముందుమాట.

కాదు. అది ఒక అనుభవం, ఒక ప్రభావ వంత మ యిన కాలం. అందుకే డాక్టర్ ఉ డుత చంద్ర శేఖర్ మనకు ఆ పాటలను కేవలం గుర్తు చేయడు. మనల్ని ఆ కాలానికి తీసుకెళ తాడు. డాక్టర్‌గా కృషి చేస్తూనే సంగీతం సినిమాలు వాటిపై అభిమానం పెంచుకోవ డమే కాకుండా అక్షర బద్ధం చేయడం అభి నందించాల్సిన విషయం, సినిమాలు, పాట లు, సాహిత్యం ఇవన్నీనాకూ అభిమాన విష యాలే కావడంతో ఈ పుస్తకం చదవుతున్న ప్పుడు నాకు అనేక అంశాలు మళ్లీ మళ్లీ గుర్తుకొచ్చాయి. గతంలో ఒక పాట విన్నప్పుడు కలిగిన కంపనం. ఒక సినిమా చూసిన తర్వాత నిద్ర పట్టని రాత్రి. ఒక గాయకుడి స్వరంలో తన బాధను కనుగొన్న క్షణం. ఒక కథానాయకు డిలో తన కలను చూసుకున్న వయసు. ఇవన్నీ నా లోపల మళ్లీ ఫి ల్మ్ రీలులా..గిరా..గిరా తిరిగాయి. ఇందులో తెలుగు సినీ గాయకులు రామకృష్ణ కెబికె మోహనరాజు వంటి తెరమరుగైపోయిన కళాకారుల ప్రస్తావన ఉ ంది. ఎన్నో మరుగుపడిపోయిన గీతాల ప్రస్తావనలున్నాయి. అనేక మంది మరచి పోయిన స్వరాల ప్రతిధ్వనులు ఉన్నాయి. ఇవి కేవలం సమాచారంగా ఉండి ఉంటే ఈ పుస్తకం ఒక సూచికగా మిగిలిపోయేది.

కానీ రచయిత డాక్టర్ ఉడుత చంద్రశేఖర్ వాటి మధ్య తన ఆనందాన్ని అనుభవాన్ని, హృదయాన్ని ఉంచారు.

అదే ఈ పుస్తక బలం. ఒక పాట గురించి రాస్తూ దాన్ని మొదటిసారి ఎక్కడ విన్నారో చెబుతారు. ఒక సినిమా గురించి చెబుతూ అది తనలో మిగిల్చిన వెలుగునీ, నీడనీ పంచు కుంటారు. ఆ వ్యక్తిగత స్పర్శ వల్లే ఈ పుస్తకం పాఠకుడి చేతిలో ఒక డేటా బుక్ రీతిగా కాకుండా ఒక మిత్రుడిగా మారుతుంది.


జ్ఞాపకాలు విచిత్రమైనవి. మనకు మరిచి పోయిన పేర్లు గుర్తుండవు.

కానీ ఒక పాట మొదటి రెండు పంక్తులు మాత్రం యాభై ఏళ్ల తర్వాత కూడా గుర్తుం టాయి. ఒక సినిమా కథ మొత్తం మరిచి పోతాం. కానీ ఒక దృశ్యం జీవితాంతం వెంటా డుతుంది. కాలం తీసుకుపోయేది మన వయసును మాత్రమే.మనసును తాకిన స్వరాలను కాదు. అం దుకే ఈ పుస్తకం చదువుతున్నప్పుడు మనం రచయిత జ్ఞాపకాలను మాత్రమే చదవం. మన సొంత జ్ఞా వకాల గదుల్లోకి కూడా ప్రవేశిస్తాం.జీవితంలో అన్నీ కోల్పోయినట్లు అనిపిం చిన సందర్భాల్లో కూడా కొన్ని పాటలు మనతో ఉంటాయి. కొన్ని సినిమాలు మనకు ధైర్యం చెబుతాయి. కొన్ని జ్ఞాపకాలు చీకటిలో దీపాలవుతాయి. పాత పాటలు సినిమాలు అంటే ఇష్టం వున్న వాళ్ళకు డాక్టర్ ఉడుత చంద్రశేఖర్ పుస్తకం అలాంటి దీపాల సమాహారం. ఇది రచయిత అనుభూతించిన సాంస్కృతిక స్వీయచరిత్ర.

చివరగా ఒక మాట..

పాత పాటలు ఎప్పుడూ పాతబడవు. పాత సినిమాలు ఎప్పుడూ ముగియవు. నిజమైన జ్ఞాపకాలు ఎప్పుడూ చనిపోవు. అవి మనలో ఎక్కడో ఒకచోట కూర్చుని, మళ్లీ ఎప్పుడైనా పిలుస్తావా అని ఎదురుచూ స్తుంటాయి. ఈ పుస్తకం ఆ పిలుపు. ఆ పిలుపును అందుకోండి.. చదవండి..

-వారాల ఆనంద్
9440501281



భారతీయ పురాణ, ఇతిహాసాలు వ్యక్తిత్వ వికాస సాధనాలు



పుస్తకావిష్కరణలో సుబ్రహ్మణ్యం, వైజయంతి, బ్నిం, ఏకే ఖాన్, డా॥ కేవీ రమణాచారి తదితరులు

హైదరాబాద్, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): భారతీ య పురాణాల్లోని అంతర్లీన సూత్రాలు నేటి అంతర్జాతీయ దౌత్య నం బంధాల్లో సైతం కనిపిస్తాయని.. వ్యక్తిత్వ వికాసా నికి అవి ఎంతగానో ఉపయోగ పడతాయని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ అన్నారు. ఆదివారం రాత్రి రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ఉషశ్రీ మిషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, ఆలిండియా రేడియో పురాణ ప్రవచనకర్త 'ఉ షశ్రీ (పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు) శత జయంతి మహో త్సవం ప్రత్యేక చిహ్నం (లోగో), 'శ్రీకారం' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి ఏకే ఖాన్ ప్రసంగి స్తూ, ఉషశ్రీ మహా భారతంలోని రాయబార ఘట్టా లను నేటి ఆధునిక దౌత్యనీతితో పోల్చిన తీరును అభినంది ంచారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కె.వి. రమణా చారి అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ రచయిత బ్నిం, రామ్‌దేవ్ రావు, ఆసుపత్రి ఎండీ కల్నల్, డా॥కమ లాకర్, ఐడీఆర్‌బీటీ పూర్వ డైరెక్టర్ డా॥ ఏఎన్ రామశాస్త్రి, సుబ్రహ్మణ్యం, వైజయంతి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో రుగ్మతలు పారదోలేందుకు సాహిత్యం దోహదం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కూరపాటి వెంకటనారాయణ, ఆవుల మంజులత, వంశీ రామరాజు, ఓలేటి పార్వతీశం తదితరులు.

హైదరాబాద్, నవంబర్ 25:(నేటినిజం ప్రతినిధి): సమా జంలో రుగ్మతలు పారదోలేం దుకు, మంచి మార్పులకు సాహిత్యం ఒక మాధ్యమంగా దోహదం చేస్తుందని తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొ. కూరపాటి వెంకటనారాయణ అన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యం లో ప్రముఖ రచయిత్రి డా॥తెన్నేటి సుధాదేవి రచించిన **తంత్ర సామె తం వీధినాటిక అరవింద నాటిక** ల సంకలనం ఆవిష్కరణ సభ సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొ. కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. సుధాదేవి తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌ హోదాలో గతంలో పనిచేసిన కాలంలో నిబద్ధత కలిగిన ఉద్యోగిగా గుర్తింపు పొందారన్నారు. సంపుటి ఆవిష్కరణ చేసిన ప్రముఖ నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ.. సుధాదేవి సుమా రు 700 తెలుగు సామెతలను ఉ దహరిస్తూ కథలు రాయడం గొప్ప ప్రయత్నమన్నారు. ఆవిడ జీవించి ఉన్న సమయంలో ఆమె కోరిక మేరకు ఆ కథలు నాటకీకరణ చేసి ప్రదర్శనలు చేసే సమయానికి ఆమె మృతి చెంద టం బాధాకరం అన్నారు. తెలుగు అకాడమీ పూర్వ డైరెక్టర్ ప్రొ. ఆవుల మంజులత మాట్లాడు తూ... అమెరికాలో తెలుగు వ్యాప్తి గురించి చిట్టెన్‌రాజు గొప్ప పరిశోధనాత్మక వ్యాసం రాశారని దాన్ని గ్రంథరూపంలో తెలుగు లోకి తెస్తే చాలా ఉపయోగం అని చెప్పారు. రమాచంద్రమౌళి, శారదరాణి, ఉప్పల శశిమోహన్ పాల్గొన్నారు. స్వాగతం పలికిన వంశీ రామరాజు చైనాలో జరిగిన తెలుగు మహాసభలను నిర్వాహకుడు చిట్టెన్‌రాజు రచ యిత్రి సుధాదేవికి అంకితం ఇచ్చా రనీ, ఇందుకు ధన్యవా దాలుగా నాటికల సంపుటిని ఆయనకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2026

స్పష్టంగా, సూటిగా, నిరాడంబరంగా, భావ యుక్తంగా, శక్తివంతంగా ఉండే జన సంక్షేమ కవిత్వం రాసే కవులు "జన రంజక కవి ప్రతిభా పురస్కారాల కోసం" కవితల సంపుటాలు పంపించవలసినదిగా కోరుతున్నాం. వచన కవితలు/పద్యాలు/గేయాలు/లఘు కవితలు/బాలగేయాల సంపుటాలు ఏవైనా ఒక పుస్తకం పంపితే చాలు. 2022 నుండి 2026 వరకు ప్రచురించిన పుస్తకాలు పంపవచ్చు.ఎంపికైన పుస్తకాల కవులకు ఒక్కొక్కరికి 3000 రూ. నగదు, శాలువా, జ్ఞాపికతో రావి రంగారావు సాహిత్య పీఠం పక్షాన 2027 ఫిబ్రవరిలో గుంటూరులో జరిగే సభలో ప్రముఖుల సమక్షంలో సత్కరిం చటం జరుగుతుంది. 2026 డిసెంబరు 31 లోగా పుస్తకాలు పంపించవలసిన చిరునామా...

నర్రా ప్రభావతి, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్ 5వ లైన్ తూర్పు, గోరంట్ల, గుంటూరు- 522034

కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు
నిర్వహణ:

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
శ్రీమతి సత్య నీలిమ
95021 56813



జన్మకో శివరాత్రి ఈశ్వరా..

ఏమిటో నీ లీల ఎందుకో ఈ మాయ
తెలియకున్నది ఈశ్వరా..
మాయనే కమ్మేస్తావు ఆటలే ఆడిస్తావు
ఎక్కడో పుట్టిస్తావు వేరెవరి తో
బంధమే కలిపేస్తావు
మన్ను లో మన్నై పోయే మన్ను పై
ఆశలే కల్పిస్తావు ఆ మన్ను కోసమే
మిన్నంటే రోదనలు వేదనలు
ఆ మన్ను కోసమై ప్రాకులాడు వాడెవ్వడో
గుప్పెడు మన్నై పోవునని తెలిసిన
సత్యమే ఇది నమ్ము వారెవ్వరో
జన్మకో శివరాత్రి ఈశ్వరా..!.
ఏమిటో నీ లీల ఎందుకో ఈ మాయ
తెలియకున్నది ఈశ్వరా..
తొమ్మిది రంధ్రాల తోలు తిత్తి పై
వ్యామోహమే కల్పిస్తావు
ఆ నవరంధ్రాలతో ఇక్కట్లే తెచ్చి పెడతావు
కమ్మిన కాసుల పై వ్యామోహమే
కల్పిస్తావు తెలిసినా సత్యమే
ఇది నమ్మువారెవ్వరో
జన్మకో శివరాత్రి ఈశ్వరా..!.
ఏమిటో నీ లీల ఎందుకో ఈ మాయ
తెలియకున్నది ఈశ్వరా .
ఈక్షణమే నీది మరు క్షణం నీది కాదని
తెలిసీ చేస్తావు అంతా నాదే అన్నీ నేనే
అంటూ అహంకారం దేనికో సత్యమే
ఇది నమ్ము వారెవ్వరో
జన్మకో శివరాత్రి ఈశ్వరా .!.

-అద్దా సత్యవేణి. "సత్య" తణుకు

మనసును మెలి వేస్తూ!

కాలంతో పాటు పరుగులు తీస్తున్న జీవితమిది
అందని ఆనందాన్ని పొందాలని అత్యాశల కోర్కెలతో
ఊబిలో కూరుకుపోతున్నా ఏదో కావాలని
ఇంకేదో పొందాలనే అలుపెరుగని ఆరాటంతో..
బరువూ బాధ్యతలను వదిలివేసా కర్మ సాక్షిగా
ఊహల కలల్లో గాలి మేడలు కడుతున్నా
విలాసాల మత్తుల్లో పడి చస్తున్నా, జీవితం శాశ్వతమని
వివేక విచక్షణలు కోల్పోతున్న దురాలోచనల
దూరాచనలతో నిండిపోయింది మనసు..
అంతంలేని కోర్కెలతో
నాదీ నీదనే స్వార్థంతో పడి చస్తున్నా
జననం మరణం మధ్యన త్రిశంకు స్వర్గాన్ని సృష్టించుకున్నా
క్షణభంగురమని తెలుసు ఈ జీవితం
అయినా! ఏదో కావాలనే ఆరాటంతో పరుగులు పెడుతున్నా!
గమ్యం మరిచిన దారుల్లో పయనం ఎక్కడికో..?
అర్థం పరమార్థం వదిలి మాయాలోకంలో విహరిస్తున్నా
దాహం తీరని ఎడారుల్లో పయనిస్తున్నా
భ్రమల్లో ముంచేత్తే మాయా లోకాన్ని చూసి
మాటలు రాక .. మంచిని విడిచి మాయలో కొట్టుకుపోతున్నా..

-పద్మావతి పి., హైదరాబాద్

కమ్ముతుంది మాయ నను కమ్మగా

నా మనసే--మనసే..
ఎగసే లోలోన!
సిగ్గుపడి నువ్వలా-
నను వీడిపోకు
జంటగా నువ్వే జోడీ
కట్టి చూడు
నా గుండెలోన గూడు కట్టుకో!.
ఏవో ఊసులు చెప్పావు
నా మనసే నువ్వు దోచావు
ఎంత చెప్పినా సరే - నా మాట
వినదే
ఎందుకో-ఇది మరి ఏమిటో!
ఏమిటో ఈ మాయ!.
ఎవరిపై ఎందుకు
ఎలా పుడుతుందో ప్రేమ
ఆ పై వాడు రాసేటి రాతలోనే
అంతా ఉంది అంటావా..?.
సందేహాలన్నీ వీడి-
ఇంక వీడక కలిసిఉందాము!.
నీ చెంత చేరినంత-
నాలో మొదలాయే
ఏదో పులకింత
ఏమో-ఇది మరి ఏమో!
ఏమిటో ఈ మాయ!.
ఈ పంచభూతాలే
సాక్షులు కాగా-
పెనవేయి బంధమూ
నింగిలో ఎగిరేటి విహంగాలే
మనసు దీవించు దేవతలు!.
ఏడేడు జన్మలు
నీ తోడై ఉంటాను-
ఇది నిజము - నను నమ్ము!.
కళ్ళలోన కళ్ళు పెట్టి నన్నే-
నువ్ చూడకూ..
కమ్ముతుంది మాయ-
నను కమ్మగా!
గత గాయాలు మాయగా
మది సంతోషంతో
గంతులేయగా!.

-చంద్రకళ. దీకొండ
మల్కాజిగిరి

మాలినీ! జాలి లేదా!

ఏమిటో ఈ మాయ
నాతోనే నడుస్తూ నీ ఛాయ
కోకిల పలుకుల కోమలాంగివి
తలపులన్నీ తటాలున గుమ్మరించి
తటిల్లతవై తళుక్కున మాయమౌతావు
మనసెరిగిన మాలినీ!జాలిలేదా!.
ఊసుల రాశులన్నీ ఉసిగొలిపి
కనుదోయిని కలలతో నింపేస్తావు
అల్లంత దూరం నుండి జాలం చేస్తూ
మేలి ముసుగులో ముసిగా నవ్వుకుంటూ
మరో లోకానికి మనసంతా మళ్ళిస్తుంటావు!
తరుణీ!కరుణ జూపవా!.
తిలోత్తమవు నిను తిలకించిగానే
మైకపు మేఘాలు మేనుజేరి
వలపు వెన్నెలలు పులుముతుంటే
విరులన్నీ విరగబడి నవ్వుతున్నాయి
లలనా!లాలనగా దరిజేరవా!.
ఏమిటో!రేయిలో ఈ మాయ!
మరుని శరాలతో విరహం రాజేయ!!.

-ఆకుమళ్ళ కృష్ణదాస్

ఆకాశానికి చికిత్స

వాడెవడో ఆకాశాన్ని కిందికి దించి
కసిగా ముక్కలుగా నరికేస్తున్నాడు
గాయపడ్డ సూర్యచంద్రులకు చికిత్స
ఎక్కడోకాదు ఏకంగా మా ఇంట్లోనే
నా వైద్యానికి అక్షరాలే మూలికలవుతూల

-డా. కె.జి. వేణు
9848070084





సభా కార్యక్రమం గురించి వివరిస్తున్న అక్షరయాన్ అధినేత అయినంపూడి శ్రీలక్ష్మి. వేదికపై అరుణోదయ విమలక్క, బైస దేవదాసు, డా॥ సుద్దాల అశోక్‌తేజ, డా॥ మామిడి హరికృష్ణ, వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, శ్రీధర్.



'జయ విపంచి' పుస్తకావిష్కరణలో అయినంపూడి శ్రీలక్ష్మి, డా॥ చిరంజీవి తాయి, బైస దేవదాసు , డా॥ సుద్దాల అశోక్‌తేజ, అరుణోదయ విమలక్క, వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా॥ మామిడి హరికృష్ణ, శ్రీధర్ తదితరులు.



కన్నుల పండుగగా జరిగిన కోడూరి లీలావతి దేవి శతజయంత్యుత్సవం

అక్షరయాన్ తెలుగు మహిళా రచయిత్రుల సంస్థ, అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్, కోడూరి లీలావతి దేవి - పద్మిని మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీలో నవంబర్ 21న నిర్వహించిన సంగీత సాహిత్య కళానిధి కోడూరి లీలావతి దేవి శతజయం త్యుత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కోడూరి లీలావతి రచించిన చారిత్రక నవల **"జయవిపంచి"** ఆవిష్కరణ జరగడం ఒక ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రజాకవి, సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ ముఖ్య అతిథిగా, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు విశిష్ట అతిథిగా, 'నేటి నిజం' పత్రిక సంపాదకులు బైస దేవదాస్ గౌరవ అతిథిగా, ప్రజాగాయని అరుణోదయ విమలక్క ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ మామిడి హరికృష్ణ సభాధ్యక్షత వహించారు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ... "ప్రబంధ సాహిత్యాలపై వచనంలో వచ్చిన తిరుగుబాటు నవల. చారిత్రాత్మక నవలను నిర్వహించటం చాలా కష్టం. కొంత గ్రాంధిక, ఉపరితల భాష రాయవలసి వస్తుంది. పైగా అది సామా టన్యులకు అర్థమయ్యేలా ఉండాలి. ఈ రెండిటి మధ్య ఉన్న సన్నని పొరను కాపాడుతూ రాయడం చాలా కష్టమని తెలుపుతూ తన తల్లి గారి సాహిత్య నవలా దీపాన్ని వెలిగించే ప్రయత్నం చేసినందుకు కోడూరి శ్రీధర్‌ను అభినందించారు.

సభాధ్యక్షులు డా॥ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. భారత దేశ సాహిత్య అకాడమీ చరిత్రలో వరుసగా 1968, 1969, 1970 మూడు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి సాహిత్యంలో పురస్కారాన్ని సాధించటం అపూర్వమైన అద్భుతమైన అభిజ్ఞమైన చరిత్ర. దీనికి కారణమైన కోడూరి లీలావతి గారి చరిత్రను ఒక విజువల్ డాక్యుమెంటరీ లాగా తీస్తే చాలా బాగుంటుందని సూచన చేశారు.

విశిష్ట అతిథి, గ్రంథ ఆవిష్కర్త, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు వెలుదండ నిత్యానంద రావు మాట్లాడుతూ... చారిత్రక నవలలో చరిత్రలో చెప్పని అంశాలను , కళాత్మక విలువలు, రస పోషణ, రమ్యమైన భాష ఉంటాయని తెలిపారు. అలాంటి ఉత్తమమైన నవల రచించిన కోడూరి లీలావతి గారు తను వెళ్ళిపోయిన 50 సంవత్సరాల తరువాత ఈరోజు పుస్తక రూపంలో జీవించటం మొదలు పెట్టారని, తన యుడు శ్రీధర్ తన తల్లికి మరల జీవం అందించారని అభినందించారు.

కోడూరి శ్రీధర్ మాట్లాడుతూ... వృద్ధాప్యంలో అనారోగ్యంగా ఉన్న సమయంలో తన అమ్మగారు ఈ నవల రాసారని, 35 సంవత్సరాలు దాటిన మ్యాన్‌స్క్రిప్ట్‌లో ఉన్న ఈ నవల సురవరం ప్రతాపరెడ్డి వైస్ ఛాన్సలర్ నిత్యానంద రావు, అక్షరయాన్ అధినేత అయినంపూడి శ్రీలక్ష్మి గార్ల ప్రయత్నం వల్ల బయటకు వచ్చిందని తెలియజేశారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన "నేటి నిజం" సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ... శ్రీధర్ తల్లిగారైన కోడూరి లీలావతిదేవి రాసిన నవలను ముద్రించి ఆమె సాహిత్య ప్రపంచంలో సజీవంగా ఉండేట్లు చేసినందుకు కోడూరి శ్రీధర్‌ను అభినందించారు. అక్షరయాన్ నిర్వహిస్తున్న ఈ సభ ఒక అమ్మ రాసిన నవలను ఆవిష్కరించేడమే కాకుండా ఎందరో అమ్మలు ఈ సభలో పాల్గొన్నేట్టు చేసి అమ్మల సభగా తీర్చిదిద్దారు. అక్షరయాన్ 1700 మంది సభ్యులతో నిర్వహించడం దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో ఉన్నందుకు అక్షరయాన్ చేస్తున్న కృషిని అభినందించారు.

డా॥ చిరంజీవి తాయి నాలుగు దశాబ్దాలకు పైగా ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ వైద్యసేవలందిస్తూ, ఆధునిక రోబోటిక్ శస్త్రచికిత్సల్లో ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించారు. వైద్యరంగంలో మహిళలకు ఆదర్శంగా నిలిచిన ఆమె విశిష్ట సేవలను గుర్తించి, వైద్యరంగ పురస్కారంతో...

సామాజిక సేవారంగంలో **డా॥ మమత రఘువీర్** పాతికేళ్లకు పైగా మహిళలు, బాలల హక్కుల పరిరక్షణకు అంకితమయ్యారు. 'తరుణి' సంస్థ ద్వారా బాలికల విద్య, రక్షణ, పునరావాసానికి కృషి చేస్తూ, బాధిత చిన్నారులకు భరోసాగా నిలిచిన ఆమెను సామాజిక సేవారంగ పురస్కారంతో...

ఆధ్యాత్మిక రంగంలో **డా॥ కొమ్మినేని నాగేశ్వరి** 27 సంవత్సరాలకు పైగా మహిళా ఆరోగ్య పరి రక్షణకు సేవలందిస్తూ, 'స్ఫూర్తి కుటుంబం గ్లోబల్' ద్వారా భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, కుటుంబ విలువల పరిరక్షణకు కృషి చేస్తున్నారు. వైద్యసేవతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రబోధిస్తున్న వీరిని...

సాహిత్యరంగంలో **చివుకుల శ్రీలక్ష్మి** 24 సంవత్సరాలు ఉపాధ్యాయినిగా సేవలందించడంతో పాటు నాలుగు దశాబ్దాలకు పైగా కవిత్వం, కథలు, వ్యాసాలు, పరిశోధనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. అనేక జాతీయ పురస్కారాలు అందుకున్న ఆమె సాహిత్య కృషిని గుర్తించి సాహిత్య రంగ పురస్కారంతో...

సంగీత రంగం లో **కట్టమూరి సుబ్బ లక్ష్మి సత్యానంద్** బాల్యం నుంచే వీణా వాదనలో అసా ధారణ ప్రతిభను కనబరిచా రు. ఆకాశవాణి బి-హై గ్రేడ్ కళాకారిణిగా, పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి శిష్యురాలిగా, దేశవ్యాప్తంగా అనేక కచేరీలతో సంగీత ప్రియుల మన్ననలు పొందారు. కర్ణాటక సంగీతానికి ఆమె అంది ంచిన విశిష్ట సేవలను గుర్తించి సంగీత రంగ పురస్కారంతో సన్మానించారు.

ఇదే వేదిక మీద వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన బాలబాలికలకు ప్రతిభా పురస్కారాలు అందజేసారు. విభిన్న రంగాల్లో చిన్నారులు సాధించిన విజయాలను గుర్తించి గౌరవించారు.

అక్షరయాన్ బాలబాలికల విభాగ అధిపతి **ఫాలి లలిత ప్రవల్లిక** ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రేమోన్మాది దాడి నుంచి తన స్నేహితురాలిని రక్షించే ప్రయత్నంలో ప్రాణాలకు తెగించి పోరాడి గాయపడిన సాహస బాలిక **లక్ష్మి** ధైర్యసాహసాలను ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు ప్రకటించిన సాహస బాలిక పురస్కారంతో పాటు నగదు బహుమతిని కుటుంబ సభ్యులకు పంపించారు.

మృదంగం, కూచిపూడి, కర్ణాటక సంగీతం, నట్టువాంగం, గిటార్ వంటి కళల్లో ప్రతిభ కనబరుస్తూ, జాతీయస్థాయి మృదంగ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన 11 ఏళ్ల బాల కళాకారుడు **లంకెల గోకుల చంద్ర** , జాతీయ గ్రాప్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రజత, కాంస్య పతకాలు, ఎంఎంఏలో కాంస్య పతకం సాధించిన 15 ఏళ్ల యువ క్రీడాకారుడు **ఎన్. సాయి రాహుల్**ను, కిక్‌బాక్సింగ్, రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యువ క్రీడాకారుడు **టి. హర్షవర్ధన్**ను, వ్యాఖ్యాన రంగంలో ప్రతిభ కనబరుస్తూ, చిన్నతనంలోనే కథలు, కవితలతో 'Amogha's Musings' పుస్తకాన్ని వెలువరించిన బాల రచయిత్రి **దండబోయిన అమోఘ కృతి**ని, సంగీతం, పద్యగానం, శ్లోక పఠనం, నటనలో ప్రతిభ చాటుతూ, పోలాండ్‌లో 20కి పైగా గాన ప్రదర్శనలు ఇచ్చి బాలరత్న పురస్కారం అందుకున్న బాల కళాకారుడు **కోడూరు శ్రీకృష్ణ కౌశల్**ని, చిత్రలేఖ నంలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అనేక పతకాలు సాధించి, బాపు పురస్కారం అందుకున్న యువ చిత్రకారిణి **జాన్వి బైరూ**ను, 'కృషి శతకం' రచించి, పద్యరచనలో విశేష ప్రతిభ కనబరుస్తూ పలు సాహిత్య పురస్కారాలు అందుకున్న బాల కవయిత్రి **పర్శకుర్మి రిషిక**ను, 30కి పైగా కథలు రచించి, వాటిలో 17 కథలతో 'రంగుల కలలు' కథా సంపుటిని వెలువరించిన బాల కథా రచయిత **సాగర్ల శ్రీవర్ధన్**ను, 108 పద్యాలను నిరాటంకంగా ధారణ చేసి ప్రధమ బహుమతి సాధించడంతో పాటు పలు పద్య పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని **ఇంగువ కామేశ్వరి**ని ఘనంగా సత్కరించారు.

"మహిళ, పిల్లలు, పుస్తకం" అనే అంశాలపై జరిగిన కవితల పోటీ విజేతలకు నగదు బహుమతి అందజేశారు.

మొదటి బహుమతి అయిత అనిత రాసిన **"బాల్యం ఓ నెమలీక"** 2000/-,

రెండవ బహుమతి రమాదేవి కులకర్ణి గారు రాసిన **"మూడు ప్రపంచాలు"** 1500/-,

మూడవ బహుమతి వకుళ వాసు గారు రాసిన **"బొడ్డు మల్లెలు"** 1000/- నగదును గెలుచుకున్నాయి.

2 కన్సోలేషన్ బహుమతులను కూడా అందజేశారు.

ఇదే కార్యక్రమంలో కవాడీగూడా విరజానందా వేదిక్ విద్యాలయం లో విద్యార్థులకు చేపట్టిన "జయ విపంచి" నవలపై వ్యాస పోటీలకు గాను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రెండు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

అదేవిధంగా ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రెండు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు.

తన గళంతో వెయ్యికి పైగా కథలకు జీవం పోస్తూ ప్రముఖ గళ కళాకారుడు **వెంపటి కామేశ్వర రావు**ను ప్రత్యేకంగా సత్కరించారు.

విజయనగర జిల్లా ప్రతినిధి **శ్రీమతి చివుకుల శ్రీలక్ష్మి** రచించిన **"మట్టి - మనిషి - మనుగడ"** నవలను అరుణోదయ విమలక్క ఆవిష్కరించారు.

సభ ప్రారంభంలో మహిళ, పిల్లలు, పుస్తకం అంశాలలో రచయిత్రులు రాసిన కవితలతో అద్భుతమైన కవిసమ్మేళనం జరిగింది.

సాహిత్య వారసత్వ పరిరక్షణ, మహిళా సాధికారత, బాలల ప్రతిభా ప్రోత్సాహం అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఒకే వేదికపై ఆవిష్కరించిన ఈ కార్యక్రమం మూడు సంస్థల సమష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది.



-విశ్వైక
అక్షరయాన్
ప్రధాన కార్యదర్శి



వైద్య సేవారంగంలో డా॥ చిరంజీవి తాయిను సత్కరిస్తున్న అతిథులు.



సుబ్బలక్ష్మి కట్టమూరి, డా॥నాగేశ్వరి, చివుకుల శ్రీలక్ష్మి, డా॥మమతా రఘువీర్ తరుపున ఆమె భర్త రఘువీర్‌లకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న అతిథులు.



పురస్కారాలు అందుకున్న చిన్నారులతో అతిథులు



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవయిత్రులతో అతిథులు

నేను నిలబడే ఉంటాను

నేనే....
నాకు నేనే...నాకై నేనే..
నా కొరకు నేనే...
నా వైపు నేనే..
నిలబడే ఉన్నాను.

ఎన్నో..
సంశయాలు..సందేహాలు
ఆశలు..అలల కొరడాలు
సుడిగుండాల భ్రమణాలు
నిలబడే ఉన్నాను..

చుట్టూరా..
భ్రమలు..విభ్రమలు
కాంక్షలు.. వింతకోరికలు
కవ్వించే కాలాల ఊబి..
నిలబడే ఉన్నాను.

ఇలా...
వేదనలు..శోధనలు
పరుగులు..పందాలు
పరిశ్రమలు..పరిభ్రమణలు
నిలబడే. ఉన్నాను.

ఇక్కడ....
ప్రారంభాలు..ప్రవాహాలు
అంతం.. విరమచిహ్నాల్లేక
ఆశ్చర్యార్థకంగా..
నిలబడే ఉన్నాను..

నా...
కాళ్ళకింద భూకంపాలు
తుఫానులు..సునామీలు
అగ్నిపర్వతాల లావాలు
అయినా నిలబడే ఉన్నాను

నిరంతరం...
తీరం తెలియని ప్రయాణం
నా చుట్టూ నేనే భ్రమణం
తరతరాలుగా.యుగాలుగా
నేనిలా నిలబడే ఉన్నాను.

ప్రశ్న...
ప్రశ్నలు..ప్రశ్నల్లోప్రశ్నలు
ప్రశ్నకే ప్రశ్నార్థకంగా
నేనే పెద్ద ప్రశ్నగా మారాను
ప్రశ్నగా నిలబడే ఉన్నాను.

అసలు..
ప్రశ్నతోనే కదా చలనం
ప్రశ్నలోనే గమనం.
నీళ్లలో నిప్పుపుంట్టింది
నిప్పులో హిమం జార్చింది
అందుకే
ప్రశ్నలా
నిలబడెవుంటాను...

-చ కొ నా
9885797375



అల్లకల్లోలం

ఉజ్వల ఆకాశం
నీరుగారిపోయింది.
నక్షత్రాలు
భయపడుతూ
కనిపిస్తున్నాయి.
తళ తళ మెరిసే సాగరం
దిక్కుమాలిన పక్షి లా
చతికిలబడింది.
మిళ మిలా మెరిసే అరణ్యం
చిక్కబడిపోయింది
కీకారణ్యం లేదు
జంతువుల వణుకు.
అన్నం పెట్టే పైరు
ఊపిరి లేదు.
చల్లగా వీచే గాలి
మెల్లగా వస్తూ ఉంది.
అంతా కలుషితం
ప్రకృతికి శాపంగా .....
ప్రపంచీకరణ మాయ.
శ్రమ సంపద
దోపిడీ చక్రం లో
దేశం చీకట్లో .....
ఆశల కన్నులు
వెలుగు కోసం
గుండె నిండిన
ఆవేశం .
ఇప్పుడది
గుప్పిట్లో .....
సాగరం కడుపునిండా.....
పగ
కెరటం గర్భంలో.....
ప్రతీకారం .
అరణ్యం
పరిణామం చెబుతున్నది
చుక్కల
మెరుపు సంగీతం
దిక్కు ల
తాండవం
మనసు మేఘాల
గర్జన
ప్రళయ నాదం
అల్లకల్లోలం
ఖాయమే..

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038





ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితలవర్క్ షాప్, అంశం "పెండ్లి". విజేతల కవితలు చదవండి.

-డా॥రావి రంగారావు
9247581825

-సంపాదకులు

ఒక్కరా ఇద్దరా..

రెండు తనువులా
రాగమొక్కటిగ..
రెండు మనసులా
గాన మొక్కటిగ...
ఓడి గెలిచిన
గెలిచి ఓడినా..
ఓట మొక్కటిగ
విజయ మొక్కటిగ..
ఇరు మనసులలో
భావ మొక్కటిగ
ఇద్దరు మనుషుల
ధ్యేయ మొక్కటిగ
ఇరువురిని కలిపే
బంధ మొక్కటిగ..
కష్ట మొక్కటిగ
కరుసు ఒక్కటిగ..
అద్ద మొక్కటిగ
అద్ద మొక్కటిగ..
పలకరించు
ప్రతిభింబ మొక్కటిగ..
నాలుగు కన్నుల
భాష ఒక్కటిగ..
నాలుక పలికే
భావ మొక్కటిగ..
వేసే అడుగుల
నడక ఒక్కటిగ..
నడుస్తున్న
ఆ దారి ఒక్కటిగ..
కోప తాపముల
తీరు ఒక్కటిగ..
శాంతిచర్చలకు
చంద్రుడొక్కడిగ..
హెచ్చుతగ్గుల
నిచ్చెనొక్కటిగ..
నడిచే నడకల
నడత ఒక్కటిగ..
ఎలపట దాపట
శక్తులొక్కటిగ...
లాగేబండికి
ఇరుసు ఒక్కటిగ..
ఇద్దరొక్కటిగ
ఒక్కరిద్దరుగ..
ఒద్దిక పొద్దిక
వడిదుడుకులను..
ఒడుపు తెలిసి
గెలుపొందాలని
దాంపత్యంలో
దంపతులిద్దరు....
కలకాలం...
కలి
సుండాలని...
జరిగే తంతే పెండ్లి.

-మేడిశెట్టి యోగేశ్వరరావు

అనురాగాల సంగమం

9490168715

రెండు మనసులను కలిపే ప్రేమబంధం,
రెండు కుటుంబాల గడపలను కలిపే అనుబంధ తోరణం,
కలల పల్లకిలో ఆశల పూలు విరబూయగా,
జీవితమనే పుస్తకంలో తెరుచుకుంటుంది కొత్త పుట...
ఏడడుగుల బాటలో చేతులు కలిసిన వేళ,
అగ్నిసాక్షిగా జీవిత ప్రమాణం చేస్తూ,
నమ్మకమనే పునాదిపై ప్రేమమందిరం నిర్మించుకుంటూ,
ఒకరి హృదయంలో మరొకరు గూడు కట్టుకుంటారు...
అలకల మేఘాలు కమ్మినా ఆప్యాయత వాన కురిపిస్తూ,
అభిప్రాయ భేదాలను అవగాహనతో అధిగమిస్తూ,
సుఖదుఃఖాల సంద్రంలో చేయి చేయి కలిపి,
ఒకరి ఊపిరికి మరొకరు తోడుగా సాగుతారు...
కన్నీటి చినుకులకు ఓదార్పు గొడుగై,
అలసిన బాటసారికి చల్లని నీడై,
ఆనందాల ముగ్గులతో గృహాన్ని అలంకరిస్తూ,
ప్రేమదీపపు వెలుగులో
జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటారు...
కాలమనే గాలికి వాడని ప్రేమ మల్లెలై,
వయసు పెరిగినా వీడని జంట పక్షులై,
చివరి మజిలీ దాకా ఒకరి చేయి మరొకరు పట్టుకుని,
జీవితాంతం నిలిచే అనురాగాల సంగమమే పెండ్లి!

-పేర్లి దాసు,9963249775

పెండ్లి ఒక జీవన లయ

రెండు మనసులు,
రెండు కలలు,
కలిసే తొలి అడుగు
సాగే దారి...
ముడి కాదు
మాట కాదు
ఇద్దరి నడకల లయ
నమ్మకపు సంతకం...
అలసినప్పుడు ఒడి,
జారినప్పుడు
వెలుగులో నీడ,
నీడలో వెలుగు,
కలిమిలో చెలిమి
లేమిలో ఆసరా...
చేయి పట్టిన చోట
చెలిమి పొదరిల్లు
అడుగు కలిసిన చోట
ఆశల కలువ పూలు...
బాధ పంచుకుంటే
తేలికయ్యే బరువు,
సంతోషం పంచుకుంటే
రెట్టింపయ్యే సిరులు...
మాట మారితే
నొప్పించే ముళ్ళు,
అహం పెరిగితే
కూలే పంతెన...
ఓపిక ఉన్న చోట
నిలిచే ఊపిరి,
క్షమ నిలిచిన చోట
కరిగే మంచు,
పొరపాట్లు జరిగినా
దిద్దుకునే మనసు
ఎదగడానికి ఇచ్చే
చల్లని గాలి...
ఎన్ని మలుపులైనా
విడవని చేయి,
ఎన్ని మలుపులు అయినా,
ఎన్ని గాలులు ఎదురైనా
చెదరని ఆరని దీపం...
కాలాన్ని జయించి
కథగా మిగిలే
ఎన్నో జన్మలైనా
కొనసాగేది...
చివరి శ్వాస వరకు
చెరగని మధురమైన జ్ఞాపకం...

-చల్లగాలి బాబురావు,
9941469728

పెళ్లంటే

పెళ్లంటే అధికారం కాదు,
ఆత్మాభిమానపు అండలో
తనువు మనసు ఆనందంతో నాట్యమాడగా,
విధాత రచించే సృష్టి కావ్యం.పెళ్లంటే వ్యాపారం కాదు,
నమ్మకం వేర్లతో నిలిచిన వ్యక్తిత్వాలు వృక్షాలు కాగా,
అనురాగ లతలతో వికసించే అందమైన పూల వనం.
పెళ్లంటే శృంగారం మాత్రమే కాదు,
నిర్మలమైన దాంపత్య ఆకాశంలో
వెలుగు చీకట్లలో దన్నుగా నిలిచే సూర్యోదయం...
పెళ్లంటే ఆకర్షణ ఒక్కటే కాదు,
బాధ్యత, పరిపక్వతతో, గౌరవం నిలిచే మనసుతో,
అగ్నికి ఆజ్యంలా దంపతులు చేసే పవిత్ర యజ్ఞం...
పెళ్లంటే గాలివాటు ప్రయాణం కాదు,
సహనమనే చుక్కాని, స్నేహమనే తెరచాపతో
రెండు నావల బంధం
ఒక్కటిగా పెనవేసుకుని చేరే మధుర గమ్యం...
పెళ్లంటే విలాసం కాదు,
ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు స్తంభాలు నాటి,
ఇంటిని నిలబెట్టి,
శాంతిని, సంతోషాన్ని పంచే ధర్మ మార్గ సాధనం...
పెళ్లి అంటే నూరేళ్ల పంట,
అదిమూడు నాళ్ల ముచ్చటగా మారితే సమాజానికి అరిష్టం.
సరిదిద్దుకుని జంటై నిలిస్తే సమాజానికి అందం...

-బి. కోమల సత్యవతి, 9989963383

గమ్యం మరచి

వేరు వేరు తోటల్లో విరిసిన సుమాలు
ఒకే వేదికపై జత పడి పరిమళిస్తూ
మూడు ముళ్ళ బంధంలో
ఏడేడు జన్మల అనుబంధాన్ని
కలబోసుకుంటూ...
ఒకరి ఆలోచనల విత్తుల్ని
మరో మనసు నేలలో మొలిపించడం,
ఒక కంటి చినుకులు
మరో గుండెను తడిపేస్తుంటే
కష్టాల జడివానలో
ఒకరికొకరు ఛత్రమవుతూ
మబ్బులు కమ్మిన ఆకాశం లోనూ
చెదరని వెన్నెలై సాగటమే...
సప్తపదిలో పట్టిన చేయి
సప్త సముద్రాల పయనంలో
నైనా వీడననే ప్రమాణాలే ...
నేడు... బిగుసుకుపోతున్న
పెళ్లి తంతుల్లోసడలిపోతున్న
పవిత్రతలు,
అసహజ రీతులతో
అనుమానాల
ఫిరంగులతో
పెళ్లి కోటను
పేల్చేస్తుంటే...
జీవితపుస్తకం లో ..
ఓ అందమైన
అధ్యాయం
అధ్యయనానికి
నోచుకోకుండానే
అంతమైపోతుంది...
మారిపోతున్న
ప్రయాణాలు
చెదిరిపోతున్న
ప్రమాణాలతో
అస్థిత్వాన్ని... కోల్పోతూ
నేడు... పెళ్లి!

-మేడిశెట్టి సుభద్రా కృష్ణ



రాజ్యాంగ మూల ప్రతిరూపకర్త బి.ఎన్.రావు

బెనెగల్ నరసింహా రావు భారత దేశంలో దాదాపు తెర మరుగైన వ్యక్తి, కనుమరుగైన పేరు. బి.ఎన్.రావుగా నాడు నుపరిచితులయిన ఆయన భారత రాజ్యాంగం రూపొందిం చిన అసలు వ్యక్తి అని తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు.

రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులుగా బాబా సాహెబ్ ఎన్నుకోబడిన సందర్భంలో ఆయన అన్న మాటలు...

"షెడ్యూల్డ్ కులాల ప్రయోజ నాలను కాపాడు కోవడం అనే ఒకే ఒక్క తలంపుతో వచ్చిన నాకు రాజ్యాంగ అసెంబ్లీలో ఇటువంటి మరింత బాధ్యతా యుతమైన అధికారం చేపట్టమని నాకు అప్పగించా రు. రాజ్యాంగ అసెంబ్లీ నన్ను డ్రాఫ్టింగ్ కమిటీకి సభ్యుడిగా నన్ను ఎన్నుకున్నప్పుడు నేను చాలా ఆశ్చర్య పోయాను. అలాగే అంతకు మించి నేను ముసాయిదా కమిటీకి ఛైర్మన్ గా ఎన్నుకో బడినప్పుడు మరింత ఆశ్చర్య పడ్డాను. ఎందుకంటే అప్పటికే డ్రాఫ్టింగ్ కమిటీలో నాకన్నా మెరుగైన, మరింత సమర్థవంతులైన వారుండటం. అలాగే...

"నాకు ఇచ్చిన క్రెడిట్ నిజంగా నాకు చెందినది కాదు. ఇది కొంతవరకు రాజ్యాంగ అసెంబ్లీకి రాజ్యాంగ నలహాదారు నర్ బిఎన్ రావుకు చెందినది, వారు ముసాయిదా కమిటీ పరిశీలన కోసం రాజ్యాంగం యొక్క కఠినమైన ముసాయిదాను సిద్ధం చేశారు". అని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 25 నవంబర్ 1949 న రాజ్యాంగ అసెంబ్లీలో తన ముగింపు ప్రసంగంలో పేర్కొనడాన్ని బట్టి నరసింహా రావు ప్రతిభ, గొప్పతనం స్పష్టం అవుతున్నది.

రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు డా. బాబు రాజేంద్ర ప్రసాద్ కూడా రాజ్యాంగ సంతకం రోజున....భారత రాజ్యాంగానికి "ప్రణాళికను దృశ్యమానం చేసి, పునాది వేసిన వ్యక్తి" అని బి.ఎన్.రావు కృషిని కీర్తిస్తూ చేసిన ప్రస్తావన రావు ప్రతిభను తేటతెల్లం చేస్తున్నది.

1887 ఫిబ్రవరి 26న సంప్రదా య బ్రాహ్మణ వేదాంవుల కుటుంబంలో మంగళూరులో జన్మించి, సివిల్ సర్వీసెస్, న్యాయ శాస్త్ర పారంగ తునిగా పేరెన్నిక గని, బ్రిటిష్ ఇండియా లో న్యాయ మూర్తిగా పని చేసి, అపార అనుభవం గడించి, 1947 లో బర్మా మరియు 1950 లో భారతదేశం యొక్క రాజ్యాంగాలను రూపొందిం చడంలో ప్రధాన పాత్ర పోషించారు.

నరసింహా రావు (26 ఫిబ్రవరి 1887 – 30 నవంబర్ 1953) 1950 నుండి 1952 వరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి అధ్యక్షునిగా ఉన్నారు.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (1950?52) లో భారత ప్రతినిధిగా, అధ్యక్షుడి గా పని చేశారు. కొంతకాలం (1944?45) జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఫిబ్రవరి 1952 నుండి మరణిం చే వరకు, హేగ్‌లోని అంతర్జా తీయ న్యాయస్థాన న్యాయ మూర్తిగా పనిచేశారు. తూర్పు బెంగాల్ లోని అనేక జిల్లాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. 1925 లో, అస్సాం ప్రభుత్వం ప్రావిన్షియల్ కౌన్సిల్ కార్యదర్శిగా సుమారు ఎనిమిది సంవత్సరాలు ఈ వదవిలో పనిచేశారు. ఈ విధులతో పాటు, సైమన్ కమిషన్‌కు ఆర్థిక సహాయం కోసం మెమోరాం డాను రూపొందించడం విషయంలో అస్సాం ప్రభు త్వానికి సహకరించారు. వాటర్స్ కమిషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. జమ్మూ కాశ్మీర్ రాచరిక ప్రధాన మంత్రిగా ఉంటూ,1945 లో అప్పటి కాశ్మీర్ మహారాజాతో విభేదాలను అనుసరించి ఆయన ఈ పదవికి రాజీనామా చేశారు.

సంస్కరణల కార్యాలయంలో ఉండటానికి మరియు రాజ్యాంగ మరియు సమాఖ్య సమస్యలపై పనిచేయడానికి ఇష్టపడగా, గవర్నర్ జనరల్ కార్యాలయంలో కార్యదర్శిగా నియమించ బడ్డారు. రాజ్యాంగ సంస్కరణలపై పనిచేశారు. రావు 1946 లో రాజ్యాంగ అసెంబ్లీకి రాజ్యాంగ నలహా దారుగా నియుక్తులు అయి నారు.

రాజ్యాంగ ముసాయిదా రాజ్యాంగంపై చర్చలో నిమ గ్నమై ఉండగా, హైదరాబాద్ నిజాం మరియు భారత ప్రభుత్వాల మధ్య జరిగిన వివాదంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి జోక్యం చేసుకో గలదా అనే ప్రశ్నపై సంక్షిప్త సమాచారం సిద్ధం చేయడానికి రావు పనిచేశారు.1946లో భారత రాజ్యాంగాన్ని రూపొందిం చడంలో రాజ్యాంగ సభకు రాజ్యాంగ సలహా దారుగా బిఎన్ రావు నియ మించ బడ్డారు.ఫిబ్రవరి 1948 లో దాని ప్రారంభ ముసాయి దాను సిద్ధం చేశారు. ఇట్టి ముసాయిదాను 26 నవంబర్ 1949 న భారత రాజ్యాంగ నభ చర్చించింది, సవరించింది మరియు చివరకు స్వీకరించింది.

భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో తన పరిశోధనలో భాగంగా, 1946 లో, ఆయన యుఎస్, కెనడా, ఐర్లాండ్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్‌లలో పర్యటించారు, అక్కడ రాజ్యాంగ చట్టంపై న్యాయ మూర్తులు, పండితులు మరియు అధికారులతో వ్యక్తిగత సంప్రదింపులు జరిపారు. ఇతరులలో, అమెరికన్ సుప్రీంకోర్టు జస్టిస్ ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్‌ను కలిశారు.

రాజ్యాంగ నలహా దారుగా అయన తయారు చేసిన ముసాయిదా అక్టోబర్ 1947 లో సమర్పించ బడింది. ఇతర దేశాల రాజ్యాంగాలపై తనకు గల విస్తృత పరిజ్ఞానంతో, అలాగే మన దేశంలోని పరిస్థితులపై తనకు గల అపార అధికార నైపుణ్యం తో పాటు తన స్వంత పరిపాలనా అనుభవము రంగరించి తన బాధ్యతను సక్రమంగా నెర వేర్చారు రావు. ఈ ముసాయి దాతో పాటు, రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటు చేసిన వివిధ ఇతర కమిటీలు ప్రతిపాదించి నవి పరిగణనలోకి తీసుకో బడ్డాయి.

బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 1947 ఆగస్టు 29 న ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసిన రాజ్యాంగ అసెంబ్లీ తీర్మానం, "రాజ్యాంగ నలహాదారుగా రావు తయారు చేసిన రాజ్యాంగం ముసాయిదాను పరిశీలించ డానికి, అప్పటికే అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాలను అమలులోకి తెచ్చేందుకు, దానికి సంబంధించిన అన్ని విషయాలను చేర్చడానికి లేదా మార్చుటకు చర్యలు చేపట్టడం జరిగింది.

ముసాయిదా కమిటీ మొదటి ముసాయి దాను 1948 ఫిబ్రవరిలో ప్రచురించింది. ముసాయిదాపై చర్చించడానికి, సవరణలను ప్రతిపాదించ డానికి భారత ప్రజలకు ఎనిమిది నెలల సమయం ఇవ్వ బడింది. ప్రజల వ్యాఖ్య లు, విమర్శలు మరియు సలహాల వెలుగులో, బిఆర్ అంబేద్కర్ 4 నవంబర్ 1948 న (మొదటి పఠనం) తర్వాత రెండవ పఠనం నిబంధన పరిశీలనకు ఒక సంవత్సరం పట్టింది. మూడు చిత్తుప్రతులు మరియు మూడు రీడింగుల తరువాత, రాజ్యాంగం 26 నవంబర్ 1949 న ఆమోదించినట్లు ప్రకటిం చ బడింది. ఇక బి.ఎన్. రావే స్వయంగా రాజ్యాంగపు మొదటి విడతగా 243 ఆర్టికల్స్ (వర్గాలు) వ్రాసి రాజ్యాంగ రచనా కమిటీకి అందజేశారు. ఆ కమిటీ సభ్యులు కలసి రావు ప్రాథమికంగా రూపొందించిన 243 ఆర్టికల్స్ ను 315 గా రూపొందించారు. చివరకు 2473 సవరణల తరువాత ప్రస్తుత రాజ్యాంగం యొక్క చివరి రూపం మొత్తం 395 నిబంధనలతో సం తరించుకుని తుది రూపు దాల్చింది. రాజ్యాంగ నలహాదా రుగా బి.ఎన్.రావు తయారు చేసిన అసలు ప్రతి (ఒరిజినల్ డ్రాఫ్టింగ్) ఆధారం గానే రాజ్యాంగ రచనా కమిటీ రాజ్యాంగాన్ని తయారు చేసిందని, మార్పులు, చేర్పులు, సవరణలతో రెండవ పఠన దశలో అసెంబ్లీచే ఆమోదింప బడిందని స్పష్టం అవుతున్నది.

నవంబర్ 26...భారత రాజ్యాంగ ఆమోదిత దినం సందర్భంగా...



-రాము కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఉత్సాహంగా 'స్వనిక' వనభోజనాలు


హైదరాబాద్, నవంబర్ 25:22 ఆదివారం, కీసరలోని దివ్య రిట్రీట్ లో జరిగిన కార్తీక మాసపు వనభోజనాల కార్యక్ర మంలో భాగంగా విజయలక్ష్మి వెంకట్ రచించిన 'మనో మథనం' పుస్తకాన్ని ప్రముఖకవి, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ ఆవిష్కరించారు.

విజయలక్ష్మి కొలపర్తి రచించిన' అమ్మకానికో అమ్మ' పుస్తకాన్ని స్వనిక గ్రూప్ సభ్యులుస్వప్న, నిర్మల, కవిత ఆవిష్కరించారు. ఆవిష్కర్త మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ విజ యలక్ష్మి వెంకట్ రచనా సంవిధానం అద్భుతంగా ఉందని అన్నారు. ఇలాంటి రచనలు మరిన్ని రావ డం వలన సాహిత్య రంగం సుభిక్షంగా ఉంటుందని రచయిత్రి ప్రతిభను కొనియాడారు. విజయలక్ష్మి కొలపర్తి 'అమ్మకానికో అమ్మ' రచన సమాజానికి ఒక మేలుకొలుపు అని వక్తలు కొనియాడారు. వనభోజనాల వలన మానసిక ఉల్లాసం కలుగు తుందని, ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగిన వాళ్లంతా ఒకచోట కలిసి కుటుంబ



సభ్యులుగా మెలగడం వలన ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. మెరుగైన సమాజానికి ఇటువంటి మానవ సంబంధాల కలయిక అవసరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో రవళి పత్రిక అధినేత రామ శర్మ, ముక్కెర సంపత్ కుమార్, శరత్ సుదర్శి, కామేష్ భద్రి, ముచ్చర్ల రజని శకుంతల, వాసుదేవరావు, సంజయ్, అనురుద్రారెడ్డి పాల్గొన్నారు. ఇది కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమంలో హరీష్ కుమార్ శర్మ, ఉత్తర్ష, మామిడి అమరేందర్, రవి ప్రసాద్ సాండేసరి పాడిన పాటలు ఆహూతులను అలరించాయి.





17వ జాతీయస్థాయి చిన్న కథల పోటీల్లో 'సోమేపల్లి' పురస్కారాలు పొందిన విజేతలు

హైదరాబాద్, నవంబర్ 25: (నేటినిజం ప్రతినిధి): 'రమ్య భారతి' ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహిం చిన జాతీ యస్థాయి చిన్న కథల పోటీలకి 138 కథలు రాగా వాటి లో సోమేపల్లి సాహితీ పుర స్కారా లకు న్యాయనిర్ణేత ఎంపిక మేరకు ఈ విధంగా ప్రకటించ డమైనది. విజేతల వివరాలు-

అత్యుత్తమ కథగా రూ. 2500/- పొందిన ప్రథమ స్థాయి పురస్కా ర విజేత

కె.రామమోహన్ (ప్రొద్దు టూరు) రచనః ఎల్‌నినో

ఉత్తమ కథగా రూ.1500/- పొందిన ద్వితీయ స్థాయి విజేతః

ఎమ్.విజయశ్రీముఖి (వీర ప నేనిగూడెం) రచనః దగ్గమైన ముగ్గత్వంమంచి కథగా రూ.10 00/- తృతీయస్థాయి పురస్కారం పొందిన విజేతః పర్కపెల్లి యాద గిరి (సిద్ధిపేట) రచనః దుర్గవ్వప్ర త్యేక బహుమతులు రూ.500/ -చొప్పున ఇద్దరికి... 1)సింహప్ర సాద్ (హైదరా బాద్) రచనః దేవుడి మనిషి2) శ్రీను పైండ్ల (మేడ్చ్ మల్కా జ్‌గిరి) రచనః ఖాళీ భుజాల బెంగ. ఈ కథలపోటీకి ప్రఖ్యాత కథకులు కాట్రగడ్డ దయానంద్ న్యాయనిర్ణేతగా వ్యవహ రించారు. డిసెంబ రీలో జరిగే ప్రత్యేక సభలో జ్ఞాపి క, శాలువా, నగదుతో విజేతల ను సత్కరించడం జరుగుతు ందని వశిష్ట సోమేపల్లి, చలపాక ప్రకాష్ తెలిపారు.

ఏపీ సొంత ఆదాయంలో భారీ వృద్ధి.. రూ.74,342 కోట్లకు చేరిక

అమరావతి, నవంబర్ 25: రాష్ట్ర సొంత ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.74,342 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 18.7 శాతం వృద్ధి నమోదైంది. ఈరోజు (బుధవారం) ఆదాయార్జన శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల ద్వారా లీకేజీలు తగ్గడం, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడంలో ఆయా శాఖల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని సీఎం అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ఆదాయంలో ప్రతిఫలించాలని సూచించారు. పన్నుల భారం లేకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. పలు శాఖల్లో పారదర్శకత, ఆన్‌లైన్ విధానం, సంస్కరణల కారణంగా ప్రభుత్వ ఆదాయంలో పెరుగుదల కనిపించిందని చెప్పారు. 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలోని నాలుగు విభాగాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏఐ స్టాక్ వినియోగించామన్నారు. పన్ను రిటర్న్‌ల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, న్యాయ వ్యవహారాల్లో ఏఐని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు స్పెషల్ మార్జిన్‌తో కలిపి ఏపీ సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.11,738 కోట్లు అదనంగా ఆదాయ ఆర్జన జరిగింది. మొత్తంగా 18.7% వృద్ధి సాధించింది. స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం గత ఏడాది ఇదే సమయానికి రూ.62,604 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఏడాదిలో రూ.74,342 కోట్లకు రాష్ట్ర సొంత ఆదాయం పెరిగింది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1941వ రోజు 'విజేత-పరాజితుడు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'విజేత-పరాజితుడు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. .



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & నిర్వహణ
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు,
9441046839

జయాపజయాలు

నేతల గెలుపు
జనహారతుల గుండె చప్పుడు
టక్కుటమార గజకర్ణ గోకర్ణ
భీకర సంగ్రామంలో
శకుని పాచికల పాత్రలే
నేటి విజేతలు
అసలైన విజేతలు
పరాజితులు జనహృదయ శ్వాసలు.
ఏక్ సితారాకు ఎన్ని రాగాలో
మీటే స్వరాంజలుల్లో
దాగిన యోగాలు .
ఫలితాలు ఖరాఖండిగా
ఖేల్ రత్నాలు కొల్లగొట్టలే
ఓ వికెట్ చేజారిందా
కప్పు ముద్దాడే చేతులు
మారిపోతాయ్.
బుద్ధుడిని ఎవరు గెలిచారు?
అలెగ్జాండర్
ఎన్ని విజయాలు సాధించినా
వట్టి చేతులు ఎత్తి
ఏం పట్టుకు పోయాడో?!.
పదితలల రావణుడు
ఎలా అంతం అయ్యాడు!!!
కర్ణ భీష్మ సుయోధనాది
ద్రోణాదుల్ని
సైంధవుడు గెలిపించాడా?!.
ఏ ఆయుధం చేబూని మహాత్ముడు
తెల్లవాళ్ళని వెళ్ళగొట్టాడు
బాంబుల భాషలతో ఓ దేశం
మరో దేశాన్ని గెలువగలదా!.
విధ్వంసం రచనలో ఏ రోజైనా
పచ్చని యోజన ప్రభవించేనా?!
చెడగొట్టే వాడి నవ్వుల్లో
పూల పరిమళం దాగుంటుందా!?
నిన్నటిదాకా
నీది కాని నేల నాదని ప్రస్తుతः
అధికార మదాంధంతో విర్రవీగితే!
నేల పక్కున నవ్వు!
పంచభూతాల వేదిక పరిహసించు!.
చివరికీ ఆరడుగుల
నేల తల్లి ఆక్షేపించవచ్చు
వచ్చేది పోయేది ఏదీ
జీవుని చేతిలో లేదుగా!.
ధర్మోద్ధరణే విజేత
అశోక చక్రమై భాసించు
అధర్మమే
భస్మాసుర హస్తమై నిర్జించు!.

-ఏడెల్లి రాములు

గెలుపు-ఓటమి

జీవితం!
అందమైన మైదానం!
క్రీడల సమాహారం!!
సమస్యల వలయం!
మనుగడ అటైతే!
ఓడుపుగా పోరాడితే!
విజయం విజేతదే!
ఓడితే ఒక పాఠమే!!
సాధనే ఆయుధం ఆ విజేతకు!
సాధ్యమే ఆ అజేతకు!
పరాజితుడు!
ఓటమిని మోయలేని జితుడు!
అసాధ్యమైపే
ఆలోచించే అసమర్థుడు!
చేవ ఉండి
పోరాటం చేయలేక
ఓడిన పరాజితుడు!
గెలుపు ఓడుపు పట్టలేక
ఓడిన ఓటమివాడు!!.

-జె.నరసింహారావు

మూసిన తలుపుల్లోనుంచైనా...

జీవితమే ప్రశ్నలమయం
చిక్కుముళ్ల సమస్యలే అనునిత్యం!.
ఆలోచిస్తూ ఉంటే
ఆర్కిమెడిసులా
ఉపాయం తట్టకపోదు!.
మూసిన నిరాశ తలుపుల్లోంచి
పరిష్కార వెలుగు కిరణం
దూసుకురాక మానదు!.
ఆకాశంలో విహరించాలనే కల
నిజం చేసింది రైట్ సోదరుల
సుదీర్ఘ కాల ప్రయత్నం!.
కృత్రిమ అవయవాల
రూపకల్పనకు దారితీసింది
శాస్త్రవేత్తల అలుపెరుగని ప్రయత్నం!.
కృత్రిమ విద్యుత్
వెలుగుల్ని అందించింది
ఎడిసన్ రెండు వందలసార్ల
ఓటమిని అధిగమించిన
దృఢసంకల్పం!.
ఆలోచనే ఆశయమైతే
ఏకాగ్రతతో దీక్షగా ప్రయత్నిస్తే
సంకల్పమే సామర్థ్యానికి తోడైతే
లక్ష్యసాధనే గమ్యమైతే
ఆటంకాలెన్ని ఎదురైనా
ఓటములు పలకరించి
పరిహసించినా
తుదకు విజయం తథ్యమే!.
చిక్కుముళ్ల సమస్యలను
సహనంతో విడదీస్తూ
ప్రశాంతమైన మనస్సుతో
పరిష్కారమే పరమావధిగా
చిత్తశుద్ధితో
దృఢసంకల్పంతో
ప్రయత్నిస్తూ పోతే
తప్పకుండా దొరుకుతుంది
ప్రతీ సమస్యకు పరిష్కారం!.

-చంద్రకళ దీకొండ

నూటికి నూరు పాళ్ళు

అడుగు దూరమే తేడా
ఒక్కటే ఓటు ఒక్కటే మార్కు
ఒక్కటే పరుగు ఒక్కటే పాయింట్
ఆగితే లాగి పెడుతుంది
పరుగిడితే పట్టు చిక్కుతుంది.
విజేత అయినంత మాత్రాన
విర్రవీగితే చేరేది పాతాళమే
పరాజితైనా పడిన కష్టం
అనుభవపు